జగ్గారెడ్డి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. సంగారెడ్డి జిల్లాలో తాజాగా నిర్వహించిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజకీయంగా తన మనసులో ఒక ఖతర్నాక్ కోరిక ఉందని బాహాటంగా ప్రకటించారు. అసలు ఆ రహస్యం ఏమిటో రాబోయే నవంబర్ నెలలో బయటపెడతానని ఆసక్తికరంగా చెప్పారు. తనకు ముఖ్యమంత్రి కావాలనే ఎలాంటి కోరిక లేదని స్పష్టం చేశారు. కానీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాత్రం ఆ పదవి కోసం ఎప్పటికీ ప్రయత్నాలు చేస్తూనే ఉంటారని ఎద్దేవా చేశారు. పార్టీలో ఎన్ని అంతర్గత లొసుగులు ఉన్నప్పటికీ అగ్రనేత రాహుల్‌గాంధీకి చెప్పిన తర్వాతే బయట మాట్లాడుతానని తేల్చిచెప్పారు. ఆయనకు తాను గతంలోనే ఒక మాట ఇచ్చానని, ఆ మాట మీదనే ఇప్పటివరకు కట్టుబడి ఉన్నానని గుర్తుచేశారు. తన రాజకీయ కోరిక ఏమిటనేది ఇప్పుడే బయటపెట్టనని, వచ్చే నవంబర్ నెలలో పూర్తిగా వివరిస్తానని జగ్గారెడ్డి వెల్లడించారు. ఇది చాలా సీరియస్ విషయమని అందరూ గమనించాలని సూచించారు. ఏదో సాధారణ విషయంగా దాన్ని భావించవద్దని కోరారు. ముఖ్యమంత్రి పదవికి సంబంధించిన సబ్జెక్టు మాత్రం కానే కాదని కుండబద్దలు కొట్టారు. ప్రస్తుతం రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నారని, ఆయన మరో ఐదేళ్ల పాటు ఆ పదవిలో కొనసాగుతారని పేర్కొన్నారు. మరోవైపు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాత్రం పదే పదే ప్రయత్నిస్తూనే ఉంటారని చమత్కరించారు. అది పూర్తిగా వాళ్ళిద్దరి మధ్య ఉన్న పంచాయతీ అని అభివర్ణించారు. ఆ విషయాలతో తనకు ఎలాంటి సంబంధం లేదని తేల్చిచెప్పారు. తనకు మాత్రం రాజకీయంగా మరో సరికొత్త ఖతర్నాక్ కోరిక బలంగా ఉందని పునరుద్ఘాటించారు. వచ్చే నాలుగు నెలల్లో రాజకీయ పరిణామాలపై తనకు మరింత స్పష్టత వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. నవంబర్ నెల వచ్చేసరికి రాజకీయ పరిస్థితులు రెండు రకాలుగా మారే అవకాశం ఉందని జగ్గారెడ్డి విశ్లేషించారు. మనసులో ఏముందో అదే నిజం చెప్పే పరిస్థితి వస్తుందా లేక చెప్పిన మాటను మార్చే పరిస్థితి వస్తుందా అనేది ఇప్పుడు చెప్పలేమన్నారు. తానైతే నిత్యం ప్రజాక్షేత్రంలోనే ఉండే రాజకీయం చేస్తానని తెలిపారు. తన జీవితంలో కుటుంబానికి స్థానం లేదని, భార్య అలాగే పిల్లలు అనే బాధ్యతలకంటే ప్రజలు రాజకీయాలే తన సర్వస్వమని వివరించారు. ఎప్పుడూ ఇదే సిద్ధాంతంతో తాను ముందుకుసాగుతున్నానని స్పష్టం చేశారు. కాబట్టి తన మనసులోని ఆంతర్యాన్ని కచ్చితంగా నవంబర్ నెలలో అందరితో పంచుకుంటానని హామీ ఇచ్చారు. అప్పటివరకు అందరూ కొంచెం ఓపిక పట్టాలని కోరారు. తన ప్రయాణం కేవలం ప్రజాసేవ కోసం మాత్రమే సాగుతుందని మరోసారి స్పష్టం చేశారు. అధిష్టానం పెద్దలతో తన సంబంధాల గురించి మాట్లాడుతూ జగ్గారెడ్డి కీలక విషయాలు వెల్లడించారు. రాహుల్‌గాంధీని కలిసినప్పుడు ఆయన తనకు కొన్ని విలువైన సూచనలు చేశారని గుర్తుచేశారు. ఒకవేళ కాంగ్రెస్ పార్టీ మీద ఎప్పుడైనా కోపం వస్తే నేరుగా బయట విమర్శలు చేయవద్దని రాహుల్ హితవు పలికారని తెలిపారు. నేరుగా ఢిల్లీకి వచ్చి తన ముందే తిట్టుకోవాలని సూచించారని చెప్పారు. కానీ మీడియా ముందు మాత్రం ఎలాంటి వివాదాస్పద వ్యాఖ్యలు చేయవద్దని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారని వివరించారు. ఆ సమయంలో తన పక్కనే మాణిక్ ఠాకూర్ కూడా ఉన్నారని గుర్తుచేశారు. అందుకే గత మూడున్నరేళ్లుగా పార్టీలో ఎన్ని అంతర్గత విషయాలు ఉన్నప్పటికీ తాను బయట పెద్దగా మాట్లాడలేదన్నారు. తాను రాహుల్‌గాంధీకి ఇచ్చిన మాట ప్రకారం నడుచుకుంటున్నానని సగర్వంగా ప్రకటించారు. జూలై ముప్పై లోపు ఏదో ఒక సంచలన విషయం మాట్లాడుతానని తాను అన్న మాటను అందరూ గుర్తుచేస్తున్నారని జగ్గారెడ్డి పేర్కొన్నారు. ఆ విషయాన్ని తాను ఒక క్షణం పాటు పూర్తిగా మరచిపోయానని తెలిపారు. అయినప్పటికీ మీడియా మిత్రులు ఎంతో యాక్టివ్‌గా ఉండి ఆ విషయాన్ని మళ్లీ గుర్తుచేశారని ప్రశంసించారు. తాను ఇచ్చిన మాట మీదనే ఇప్పటికీ పట్టుదలగా నిలబడి ఉన్నానని స్పష్టం చేశారు. అయితే ఇక్కడ చిన్న సాంకేతిక సమస్య ఉందని అభివర్ణించారు. తాను బహిరంగంగా ఏదైనా మాట్లాడాలంటే ముందుగా రైలు ఎక్కి ఢిల్లీకి వెళ్లాలని చెప్పారు. అక్కడ రాహుల్‌గాంధీకి అన్ని విషయాలు వివరించిన తర్వాతే మీడియా ముందుకు వచ్చి మాట్లాడుతానని తేల్చిచెప్పారు. పార్టీ నియమ నిబంధనలకు తాను ఎప్పుడూ కట్టుబడి ఉంటానని మరోసారి స్పష్టం చేశారు. తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో తన పాత్ర ఎప్పుడూ క్రియాశీలకంగానే ఉంటుందని జగ్గారెడ్డి తేల్చిచెప్పారు. కార్యకర్తల సంక్షేమం కోసం తాను నిరంతరం శ్రమిస్తానని భరోసా కచ్చితంగా ఇచ్చారు. రాబోయే కాలంలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు తనవంతు కృషి చేస్తానని వెల్లడించారు. ఎవరి వ్యక్తిగత ప్రయోజనాల కోసం తాను పనిచేయలేదని, పార్టీ సిద్ధాంతాల కోసం మాత్రమే పనిచేశానని తెలిపారు. తన రాజకీయ ప్రయాణంలో ఎదురైన అడ్డంకులను ధైర్యంగా ఎదుర్కొన్నానని గుర్తుచేశారు. భవిష్యత్తులో కూడా ఇదే పోరాట పటిమను కొనసాగిస్తానని స్పష్టం చేశారు. నవంబర్ నెలలో తాను చెప్పబోయే రహస్యం రాష్ట్ర రాజకీయాల్లో పెను ప్రకంపనలు సృష్టిస్తుందని అందరూ భావిస్తున్నారు. అప్పటివరకు తన రాజకీయ వ్యూహాలు ఎలా ఉండబోతున్నాయనేది నిరంతరం చర్చనీయాంశంగా మారుతోంది. మొత్తానికి జగ్గారెడ్డి చేసిన తాజా వ్యాఖ్యలు కాంగ్రెస్ వర్గాల్లో తీవ్ర ఉత్కంఠను రేకెత్తిస్తున్నాయి.

## లక్ష్మీపురంలో భూ వివాదం

### ముగ్గురిపై కేసు నమోదు: ఎస్సై రవికుమార్

**డోర్నకల్,విశాల భారతి:** మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో భూమి విషయంలో ఇద్దరు అన్నదమ్ముల మధ్య జరిగిన గొడవలో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు దంతాలపల్లి ఎస్సై రవికుమార్ తెలిపారు.ఎస్సై రవికుమార్ వివరాల ప్రకారం. లక్ష్మీపురం గ్రామానికి చెందిన ఇద్దరు అన్నదమ్ముల మధ్య భూమి విషయంలో కొంతకాలంగా వివాదం కొనసాగుతోంది. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుని, అది తీవ్రరూపం దాల్చడంతో పరస్పరం కొట్టుకున్నారు. ఈ ఘటనలో ఇరువర్గాల ఫిర్యాదుల మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఆయన తెలిపారు. ప్రజలు వ్యక్తిగత వివాదాలను చట్టబద్ధంగా పరిష్కరించుకోవాలని, గొడవలు, దాడులకు పాల్పడకుండా పోలీసులకు సమాచారం అందించాలని ఎస్సై రవికుమార్ సూచించారు.

## యువ ఇంజినీర్లను అవమానిస్తారా..?

**మొదటిపేజీ తరువాయి**



రేవంత్ రెడ్డి ఎప్పుడైనా ఒకే ఒక్క పోటీ పరీక్ష రాశారా అని నిలదీశారు. ఏదైనా ప్రతిష్టాత్మక ఉద్యోగానికి ఇంటర్వ్యూకు హాజరైన అనుభవం ఉందా అని నిలదీశారు. ఏదైనా వృత్తిపరమైన సంస్థలో క్రియాశీలకంగా పనిచేసిన అనుభవం ఉందా అని వరుస ప్రశ్నలు సంధించారు. కష్టపడి చదివే యువతపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సరికాదని హితవు పలికారు. రాష్ట్ర భవిష్యత్తును తీర్చిదిద్దాల్సిన నాయకుడే ఇలా మాట్లాడటం దురదృష్టకరమని మండిపడ్డారు.రేవంత్ రెడ్డి రాజకీయ గతాన్ని రాష్ట్ర ప్రజలు ఎప్పటికీ మరచిపోలేరని కేటీఆర్ గట్టిగా పేర్కొన్నారు. సాధారణ రియల్ ఎస్టేట్ బ్రోకర్‌గా తన జీవిత ప్రయాణాన్ని ప్రారంభించిన ఆయన, ఆ తర్వాత బ్లాక్‌మెయిల్ రాజకీయాల స్థాయికి దిగజారారని విమర్శించారు. నేడు అదే పద్ధతులను పాలకుడిగా కొనసాగిస్తున్నారని ఆరోపించారు. దివాళా తీసిన కాంగ్రెస్ పార్టీలో భారీ మొత్తాలు వెచ్చించి ముఖ్యమంత్రి పదవిని కొనుగోలు చేసి అధికారంలోకి వచ్చారని తీవ్ర ఆరోపణలు గుప్పించారు. అలాంటి వ్యక్తి నేడు దేశానికి సాంకేతిక నిపుణులను, గొప్ప ఇంజినీర్లను అందిస్తున్న తెలంగాణ యువతను కించపరచడం అత్యంత దురదృష్టకరమని అన్నారు. పదవిలో ఉన్న బాధ్యత మరిచి సీఎం మాట్లాడటం తగదని చెప్పారు. ప్రజాధనాన్ని దోచుకుంటూ యువత భవిష్యత్తుతో ఆడుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కష్టపడి పైకి వచ్చిన వారిని అణచివేయాలని చూస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ యువత అంకితభావం, అద్భుతమైన కృషి, సాంకేతిక ప్రతిభ ప్రపంచవ్యాప్తంగా అగ్రగామి గుర్తింపు పొందుతున్నాయని కేటీఆర్ స్పష్టం చేశారు. అలాంటి ప్రతిభావంతులను అవమానించేలా ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలను తక్షణమే పూర్తిగా ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని కోట్లాది మంది యువతకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని గట్టిగా పట్టుబట్టారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా పెద్దఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఇంజినీరింగ్ విద్య పూర్తి చేసుకుని ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువతలో ఈ వ్యాఖ్యలు తీవ్ర నిరాశ నింపాయని అన్నారు. ప్రతిభగల విద్యార్థులను ప్రోత్సహించాల్సిన ప్రభుత్వమే ఇలా మాట్లాడటం దారుణమని విమర్శించారు. తెలంగాణ నిర్మాణంలో ఇంజినీర్ల పాత్ర ఎంతో కీలకమని, వారిని కించపరచడం అంటే తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమేనని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ప్రతిభకు తగిన గుర్తింపు లభించకుండా పాలకులు కుట్రలు పన్నుతున్నారని బీఆర్ఎస్ నేతలు ఆరోపిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో యువతకు అనేక ఉపాధి అవకాశాలు కల్పించామని కేటీఆర్ గుర్తు చేశారు. నిరుద్యోగ యువతకు భరోసా ఇస్తూ ముందుకు సాగామని తెలిపారు. కానీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఉద్యోగాల భర్తీ ప్రక్రియ పూర్తిగా నిలిచిపోయిందని విమర్శించారు. హామీలను అమలు చేయడంలో విఫలమైన ప్రభుత్వం, ప్రజల దృష్టిని మళ్లించడానికి ఇలాంటి వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తోందని మండిపడ్డారు. యువత సమస్యలను గాలికొదిలేసి వ్యక్తిగత విమర్శలకు పాల్పడటం మానుకోవాలని హితవు పలికారు. ఇప్పటికైనా పాలకులు తమ వైఖరిని మార్చుకోవాలని సూచించారు. యువతను కించపరిచేలా మాట్లాడే సంస్కృతిని వెంటనే మానుకోవాలని డిమాండ్ చేశారు. రాబోయే రోజుల్లో రాష్ట్ర యువత ఈ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతుందని కేటీఆర్ హెచ్చరించారు.

## దళిత రైతుల భూములకు పట్టాలు ఇవ్వాలి



**విశాల భారతి , అబ్దుల్లాపూర్‌మెట్ :**

రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్ మండలం అన్మగల్ గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 255/1లో ఉన్న భూములను దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్న ఎస్సీ మాదిగ సామాజిక వర్గానికి చెందిన దళిత రైతులకు పట్టాలు మంజూరు చేసి న్యాయం చేయాలని దళిత రైతుల సంక్షేమ భూ పరిరక్షణ సంఘం (రిజిస్ట్రేషన్ నం. 1474/2012) ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ డిమాండ్‌కు రాష్ట్ర ఉద్యమకాల ఫోరం (TUF) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జెనిగె విష్ణువర్ధన్ మద్దతు తెలిపారు. స్థానిక రైతులు తెలిపిన కథనం ప్రకారం.. సర్వే నంబర్ 255/1లో మొత్తం 74 ఎకరాల 30 గుంటల భూమిని నిజాం కాలం నుంచే సాగు చేస్తున్నామని తెలిపారు. అనంతరం అప్పటి ప్రధానమంత్రి ఇందిరా గాంధీ హయాంలో ఎస్సీ మాదిగ దళిత కుటుంబాలకు సుమారు 37 ఎకరాల భూమిపై సాగు హక్కు కల్పించారని, 1996 వరకు ప్రభుత్వం తమ నుంచి శిస్తు (భూమి పన్ను) కూడా వసూలు చేసిందని పేర్కొన్నారు. అడవిలా ఉన్న భూమిని ఎన్నో కష్టనష్టాలు భరిస్తూ, రాళ్లు తొలగించి, పాములు, అడవి జంతువుల మధ్య ప్రాణాలకు తెగించి సాగుకు అనుకూలంగా మార్చామని రైతులు తెలిపారు. బోర్లు వేసుకుని, విద్యుత్ కనెక్షన్లు తీసుకుని ఎన్నో సంవత్సరాలుగా వ్యవసాయం చేశామని చెప్పారు. అయితే క్రమంగా భూమిలో ఎక్కువ భాగం ఆక్రమణలకు గురై ప్రస్తుతం తమ వద్ద సుమారు 18 ఎకరాలు మాత్రమే మిగిలాయని ఆవేదన వ్యక్తం చేశారు.కొంతమంది అధికారులు అక్రమ నిర్మాణాలకు అవకాశం కల్పించారని, మరోవైపు తాము వ్యవసాయం చేయకుండా బోర్లను తొలగించారని ఆరోపించారు. గతంలో హెచ్‌ఎండీఏ అభివృద్ధి పేరుతో ప్లాట్లు ఇస్తామని చెప్పి భూములను స్వాధీనం చేసుకునే ప్రయత్నాలు జరిగాయని, అప్పటి నుంచి వ్యవసాయం చేయకుండా అడ్డుకుంటున్నారని పేర్కొన్నారు.గతంలో మాజీ మంత్రి దేవేందర్ గౌడ్, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి, కృష్ణయ్య, మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి తదితరులు ఎన్నికల సమయంలో తమకు పట్టాలు ఇప్పిస్తామని హామీ ఇచ్చారని, కానీ ఇప్పటివరకు ఆ హామీలు అమలు కాలేదని రైతులు తెలిపారు.ఇటీవల వరంగల్ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దళితులు సాగు చేస్తున్న భూములను వారికే కేటాయిస్తామని ప్రకటించిన విషయాన్ని గుర్తు చేస్తూ, అదే హామీని అన్మగల్ రైతుల విషయంలో కూడా అమలు చేయాలని కోరారు. ప్రస్తుతం అధికారులు భూమి ప్రభుత్వానికి చెందిందని, తమకు ఎలాంటి హక్కులు లేవని చెబుతూ కేసులు నమోదు చేస్తామని బెదిరిస్తున్నారని రైతులు ఆరోపించారు.తమ వద్ద పహాణీలు, పన్ను రసీదులు, ప్రభుత్వ రికార్డులు, పైసా పట్టీల్లో పూర్వీకుల పేర్లు ఉన్నాయని, ఎన్నో ఏళ్లుగా తామే కబ్జాలో ఉండి సాగు చేస్తున్నట్లు ప్రభుత్వ ఆధారాలు ఉన్నాయని రైతులు పేర్కొన్నారు. భూమి విలువ పెరిగిన తర్వాత తమ నుంచి తీసుకోవడం అన్యాయమని ప్రశ్నించారు. ఒక్కో కుటుంబంలో 20 నుంచి 50 మంది సభ్యులు ఉన్నారని, తమ జీవనాధారం పూర్తిగా ఈ భూములపైనే ఆధారపడి ఉందని తెలిపారు. దళిత రైతుల జీవన హక్కును పరిరక్షిస్తూ, సాగు చేస్తున్న భూములను వారికే కేటాయించి పట్టాలు మంజూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉద్యమకాల ఫోరం (TUF) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జెనిగె విష్ణువర్ధన్, గంగని నాగేష్, కాటపాక స్కైలాబ్, గంగని రాము, గంగని శ్రీను, జయ ఈశ్వర్, బోడ శ్రీరాములు, కాటపాక మల్లేష్, సూలారం నరసింహ, కాటపాక బాబురావు, జెనిగె శంకర్, మహిళా రైతులు తదితరులు పాల్గొని దళిత రైతులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## హస్తినాపురంలో విజయవంతమైన బీజేపీ ప్రవాస్ అభియాన్

- ఎస్ఐఆర్ కార్యక్రమంపై క్షేత్రస్థాయిలో సమీక్ష
- పార్టీ బలోపేతంపై కార్యకర్తలకు దిశానిర్దేశం

**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :**

రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు హస్తినాపురం డివిజన్‌లో నిర్వహించిన 24 గంటల ఎస్ఐఆర్ ప్రవాస్ అభియాన్ కార్యక్రమం డివిజన్ అధ్యక్షులు ఎరుకల మల్లేష్ గౌడ్ ఆధ్వర్యంలో విజయవంతంగా ముగిసింది. ఈ కార్యక్రమానికి ప్రవాస్ యోజన ఇన్‌చార్జి, రంగారెడ్డి అర్బన్ జిల్లా ప్రధాన కార్యదర్శి యస్పాల్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించారు.ఈ సందర్భంగా శక్తి కేంద్రాల ఇన్‌చార్జ్‌లు, బూత్ అధ్యక్షులు, బీఎల్ఓలు, బీఎల్ఓ2లు, బీఎల్ఏలు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో వరుస సమావేశాలు నిర్వహించి ఎస్ఐఆర్ కార్యక్రమం పురోగతిని సమీక్షించారు.



ఓటరు జాబితా ప్రత్యేక సవరణలో భాగంగా ఫారమ్‌ల నమోదు, క్షేత్రస్థాయి కార్యాచరణ, బూత్‌ల వారీగా చేపట్టాల్సిన కార్యక్రమాలపై సమగ్రంగా చర్చించి, ప్రతి బూత్‌లో కార్యక్రమాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు.ప్రవాస్ అభియాన్‌లో భాగంగా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు సి.ఎస్. గణేష్ నివాసాన్ని సందర్శించిన యస్పాల్ గౌడ్, సంస్థాగత నిర్మాణం, పార్టీ కార్యక్రమాలపై చర్చించారు. అనంతరం కార్యకర్తలతో కలిసి భోజనం చేసి, రాత్రి హస్తినాపురం డివిజన్‌లోనే బస చేస్తూ కార్యకర్తలతో మమేకమయ్యారు.రెండో రోజు ఉదయం బీరం అమరేందర్ రెడ్డి నివాసంలో నిర్వహించిన టిఫిన్ కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం పలు పోలింగ్ బూత్‌లను సందర్శించి బీఎల్ఓలు, బూత్ అధ్యక్షులతో సమావేశమై ఎస్ఐఆర్ కార్యక్రమం పురోగతిని పరిశీలించారు. రానున్న రోజుల్లో చేపట్టాల్సిన కార్యాచరణపై పలు సూచనలు చేశారు.మధ్యాహ్నం డివిజన్ కార్యదర్శి గోవర్ధన్ యాదవ్ నివాసంలో కార్యకర్తలతో సమావేశమై పార్టీ బలోపేతంతో పాటు ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రతి కార్యకర్త సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.అనంతరం దిల్‌సుఖ్‌నగర్ భాగ్ సహ కార్యవాహ్ ప్రేమ్ రాజ్ మోటేతో కలిసి పలు బూత్‌లను సందర్శించి క్షేత్రస్థాయి కార్యక్రమాలను పరిశీలించారు. హనుమాన్ నగర్‌లో కొత్త పోలింగ్ బూత్ ఏర్పాటు చేయాలని సంబంధిత బీఎల్ఓకు వినతిపత్రం అందజేశారు.ఈ 24 గంటల ప్రవాస్ అభియాన్ కార్యక్రమంలో జిల్లా నాయకులు, డివిజన్ నాయకులు, శక్తి కేంద్రాల ఇన్‌చార్జ్‌లు, బూత్ అధ్యక్షులు, బీఎల్ఓలు, బీఎల్ఓ2లు, బీఎల్ఏలు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వర్షా ల నేపథ్యంలో కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

**నిజామాబాద్ జిల్లా విశాల భారతి**

నిజామాబాద్,: ఏకధాటిగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో కంట్రోల్ రూమ్ ను ఏర్పాటు చేయడం జరిగిందని అదనపు కలెక్టర్ భుజంగరావు తెలిపారు. వర్షాల వల్ల జిల్లాలో నెలకొని ఉన్న పరిస్థితులను కంట్రోల్ రూమ్ ద్వారా సమీక్షించడం జరుగుతుందని అన్నారు. భారీ వర్ష సూచనల దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి పరిస్థితి తలెత్తినా సమర్థవంతంగా ఎదుర్కొనేలా సన్నద్ధంగా ఉండాలని క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బందిని అదనపు కలెక్టర్ ఆదేశించారు. వర్షాల వల్ల ఎక్కడైనా ఇబ్బందులు ఏర్పడినట్లు సమాచారం అందిన వెంటనే అధికారులను అప్రమత్తం చేయాలని కంట్రోల్ రూమ్ సిబ్బందికి సూచించారు. జిల్లాలో ప్రస్తుతం పరిస్థితి పూర్తిగా అదుపులోనే ఉందని, ఎలాంటి ఆందోళనకు గురి కావాల్సిన అవసరం లేదని తెలిపారు. జిల్లా యంత్రాంగం అనుక్షణం అప్రమత్తంగా ఉంటూ పరిస్థితిని సమీక్షిస్తున్నామని అన్నారు. వర్షాల వల్ల జిల్లాలో ఎక్కడైనా ఇబ్బందులు తలెత్తితే, కలెక్టరేట్



లో కొనసాగుతున్న కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబర్: 08462 220183 కు సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు.

## తెలంగాణ–మహారాష్ట్ర సరిహద్దులో మంజీర నదికి భారీ వరద

**నిజామాబాద్ జిల్లావిశాల భారతి**

బోధన రూరల్ తెలంగాణ మరియు మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతంలో కురుస్తున్న వరుస వర్షాల కారణంగా మంజీర నది ఉధృతంగా ప్రవహిస్తోంది. నదిలోకి భారీగా వరద నీరు వచ్చి చేరడంతో నీటి మట్టం గణనీయంగా పెరిగింది.

**ప్రధాన విశేషాలు:**

**బ్రిడ్జిని తాకుతూ వరద నీరు:** సరిహద్దు వంతెన (బ్రిడ్జి) కింద మంజీర నది ప్రవాహం అత్యంత ఉధృతంగా ఉంది.

**భారీ వర్షాలు:** నిరంతరాయంగా వర్షం కురుస్తుండటంతో ప్రవాహ వేగం గంటగంటకూ పెరుగుతోంది.

**పరిస్థితి సమగ్ర పరిశీలన:** పరిస్థితిని సమీక్షించేందుకు మరియు వరద తీవ్రతను అంచనా వేసేందుకు వర్షంలోనూ సరిహద్దు బ్రిడ్జి వద్ద ప్రవాహాన్ని పరిశీలిస్తున్నారు.

నదీ పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, నది వైపు వెళ్లకూడదని అధికారులు సూచిస్తున్నారు.



# ఆరుట్ల తెలంగాణ పబ్లిక్ స్కూల్ దేశానికే ఆదర్శం

- విద్యార్థులు క్రమశిక్షణ
- ఆత్మవిశ్వాసం సమయ పాలన అలవర్చుకోవాలి
- మంచాల మండలాన్ని ఆదర్శ మండలంగా అభివృద్ధి చేస్తా
- ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి

**విశాల భారతి ఇబ్రహీంపట్నం:**



మంచాల మండల పరిధిలోని ఆరుట్ల గ్రామంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ లో గురుపూర్ణిమ సందర్భంగా తెలంగాణ పబ్లిక్ స్కూల్‌లో జరిగిన ఇన్‌స్పైర్ 2026 కార్యక్రమం స్ఫూర్తిదాయక వాతావరణంలో ఉత్సాహ భరితంగా సాగింది. మల్‌రెడ్డి యువశక్తి నేతృత్వంలో మల్‌రెడ్డి అభిషేక్‌రెడ్డి సారథ్యంలో ఆరుట్ల టీపీఎస్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు ఆకెళ్ల రాఘవేంద్ర, జిల్లా అడిషనల్ కలెక్టర్ కిరణ్మయి, జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు, ఇబ్రహీంపట్నం ఏసీపీ కె.వి.రాజు ఇతర అధికారులు, హాజరయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేసిన ఈ పాఠశాలలో ఇరవై గ్రామాలకు పైగా చెందిన విద్యార్థులు సుమారు రెండు వేల మంది వరకు ఉండగా... ఈ కార్యక్రమంలో పన్నెండు వందల మంది వరకు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వ్యక్తిత్వ వికాస నిపుణులు ఆకెళ్ల రాఘవేంద్ర మోటివేషనల్ సెషన్ ద్వారా విద్యార్థులకు జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించేందుకు అవసరమైన మార్గదర్శకత్వం అందించారు. తనదైన శైలిలో ఆకెళ్ల సుమారుగా గంటన్నరపాటు ఏకధాటిగా మాట్లాడుతూ విద్యార్థులను ఆలోచింపజేశారు. లక్ష్యాన్ని నిర్దేశించుకోవడం, క్రమశిక్షణను అలవర్చుకోవడం, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగడం, సమయాన్ని సద్వినియోగం చేసుకోవడం వంటి జీవితాన్ని మలిచే విలువలను ఎంతో సరళంగా, ఉదాహరణలతో వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి మౌలిక సదుపాయాలను కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. విద్యార్థులు పుస్తక పాఠాలకే పరిమితం కాకుండా క్రమశిక్షణ, వ్యక్తిత్వ, వికాసం సమయపాలన అలవర్చుకోవాలని సూచించారు. విద్యార్థులు సరైన మార్గంలో నడవడానికి ఆకేలా రాఘవేందర్ మోటివేషన్ ఎంతో అవసరమని అన్నారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గం మంచాల మండలంలోని గ్రామాలలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్టు తెలిపారు. ప్రభుత్వం విద్య వైద్యం పై ప్రత్యేక దృష్టి సారిస్తుందని, మంచాల మండలాన్ని ఆదర్శ మండలంగా అభివృద్ధి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కిరణ్మయి, డిఇఓ వెంకటేశ్వర్లు, గ్రామ సర్పంచ్ మానుపాటి శోభ కుమార్, మండల తహసిల్దార్ ఎం.వి ప్రసాద్ రావు, టి పి ఎస్ హెచ్ గిరిధర్ గౌడ్, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు మల్ రెడ్డి అభిషేక్ రెడ్డి, ఉపసర్పంచ్ నూకం రాజు, మండల అధ్యక్షులు ఎడ్మ నరేందర్ రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి, బైరిక రమాకాంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## దాతల సహకారం అభినందనీయం: ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతిరెడ్డి




**కోదాడ, (విశాలభారతి):** ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి దాతలు అందిస్తున్న సహకారం ఎంతో అభినందనీయమని కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతిరెడ్డి పేర్కొన్నారు. స్నేహ హస్తాలు ఫౌండేషన్, రే ఫర్ చేంజ్ ఆర్గనైజేషన్ సంయుక్త ఆధ్వర్యంలో కోదాడ మండలంలోని రెడ్లకుంట ప్రాథమికోన్నత పాఠశాలలో చేపట్టిన పలు అభివృద్ధి పనులను గురువారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. స్నేహ హస్తాలు ఫౌండేషన్, శ్రీలక్ష్మి ట్రాన్స్‌పోర్ట్ నిర్వాహకులు కునుగుంట్ల రవి కుమార్, రే ఫర్ చేంజ్ ఆర్గనైజేషన్ బాధ్యులు కంఠమనేని హేమ ఆర్థిక సహకారంతో సుమారు రూ.6.50 లక్షల వ్యయంతో పాఠశాలలో అదనపు వాష్ రూమ్‌ల నిర్మాణం, పెయింటింగ్ పనులు పూర్తి చేయడం సంతోషకరమన్నారు. పాఠశాలల సమగ్ర అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు చేయూతనివ్వాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పోలంపల్లి కుటుంబరావు, మండల పార్టీ అధ్యక్షుడు శరభేశ్వరరావు, మాజీ ఎంపీపీ మల్లెల రాణి బ్రహ్మయ్య, నవీన్, ఉప సర్పంచ్ మల్లెల ప్రసాద్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు హరీష్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గంగవరపు లక్ష్మణరావు, నంబూరి సూర్యం తదితరులు పాల్గొన్నారు.

## పెద్దపల్లి ప్రజల చిరకాల కల బస్సు డిపో ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాం

- ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే విజయరమణ రావు
- దసరా వరకు ఆర్టీసీ బస్సు డిపో నిర్మాణ పనులు పూర్తి
- నూతన బస్సు డిపోతో పెరగనున్న రవాణా సౌకర్యాలు



**విశాల భారతి పెద్దపల్లి :** పెద్దపల్లి జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న ఆర్టీసీ బస్సు డిపో నిర్మాణ పనులను ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి తో కలిసి ప్రభుత్వ విప్ పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు పరిశీలించారు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ పెద్దపల్లి జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మాణం చేస్తున్న బస్సు డిపో పనులను తెలంగాణ ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి తో కలిసి పరిశీలించడం జరిగింది అని దసరా వరకు పెద్దపల్లి బస్సు డిపో ప్రారంభించే దిశగా పనులు త్వరగా జరిగేల ఎం.డి అధికారులకు మరియు కాంట్రాక్టర్ కు తెలిపారని అన్నారు. బస్సు డిపో పెద్దపల్లి నియోజకవర్గ ప్రజల ఆకాంక్ష అని ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో మూడు రెవెన్యూ డివిజన్లల్లో బస్సు డిపో ఉన్నప్పటికీ మొదటి నుండి పెద్దపల్లి కూడా రెవేన్యూ డివిజన్ అయినప్పటికీ కూడా పెద్దపల్లి జిల్లా కేంద్రంలో గత ప్రభుత్వ హయాంలో డిపో లేకపోవడం సిగ్గు చేటని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను శాసనసభ్యులుగా ఎన్నికైన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి పెద్దపల్లి ప్రజల ఆకాంక్ష అయిన బస్సు డిపో మంజూరు చేయమని వినతి పత్రం అందజేసిన తర్వాత వారు పెద్దపల్లి ప్రజలపై ఉన్న మమకారంతో వారు 2024 డిసెంబర్ మాసంలో పెద్దపల్లి ప్రాంతానికి విచ్చేసి యువ వికాసం బహిరంగ సభలో బస్సు డిపో మంజూరు చేయడం జరిగిందని అన్నారు. పెద్దపల్లి బస్సు డిపోను దసరా వరకు పూర్తి చేస్తామని ఆర్టీసీ ఎండీ తెలిపారని ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే విజయరమణ రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి మున్సిపల్ చైర్మన్, ఆర్టీసీ అధికారులు, పట్టణ వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, పలు గ్రామాల సర్పంచులు, సింగిల్ విండో చైర్మన్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మరియు తదితరులు పాల్గొన్నారు.

## భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాలి

**ప్రిన్సిపల్ బొడిగె విజయ్ కుమార్**



**చిట్యాల విశాల భారతి:** భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు చేరవేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సౌమ్య విద్యామందిర్ పాఠశాల ప్రిన్సిపల్ బొడిగె విజయ్ కుమార్ అన్నారు. ఆషాఢమాసాన్ని పురస్కరించుకుని చిట్యాల మండలం చిన్నకాపర్తి గ్రామంలోని సౌమ్య విద్యామందిర్ పాఠశాలలో గురువారం గోరింటాకు వేడుకలను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయినీలు, విద్యార్థినీలు గౌరీదేవి పూజతో పాటు మైదాకు చెట్టు, రోలుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సహజ గోరింటాకు ఆకులను నూరి సంప్రదాయ పాటలు పాడుకుంటూ ఒకరి చేతులకు మరొకరు గోరింటాకు అలంకరించుకుని వేడుకలను ఉత్సాహంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ విజయ్ కుమార్ మాట్లాడుతూ గోరింటాకు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందన్నారు. సహజ గోరింటాకు శరీరానికి చల్లదనాన్ని అందించడంతో పాటు ఆరోగ్యపరంగా కూడా అనేక ప్రయోజనాలు కలిగి ఉంటుందని తెలిపారు. ప్రస్తుత కాలంలో రసాయనాలతో తయారయ్యే కోన్ మెహందీలకు బదులుగా సహజ గోరింటాకును ఉపయోగించాలని సూచిస్తూ, విద్యార్థులకు గోరింటాకు విశిష్టత, ఆరోగ్య ప్రయోజనాలు, సాంస్కృతిక ప్రాధాన్యతను వివరించారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో సంప్రదాయాల పట్ల అవగాహన, అనుబంధాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు.

## రామగుండం వరద ప్రభావిత ప్రాంతాలను ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్‌తో కలిసి పరిశీలించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష



- వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలను వేగవంతం చేయాలి: జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష.
- ఆర్అండ్ఆర్ కాలనీలోకి వరద నీరు చేరకుండా ఆర్ఎఫ్‌సీఎల్ తక్షణ చర్యలు చేపట్టాలి

**విశాల భారతి గోదావరిఖని**

రామగుండం మున్సిపల్ పరిధిలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలను మరింత వేగవంతం చేసి, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు.గురువారం రామగుండం మున్సిపల్ పరిధిలోని 21వ డివిజన్ వీర్లపల్లి, ఓ.సి.పి 3 ఏరియా,25వ డివిజన్ వరద ప్రభావిత ప్రాంతాలను రామగుండం శాసనసభ్యులు రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్, అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్), మున్సిపల్ కమిషనర్ రామగుండం అరుణ శ్రీ తో కలిసి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష క్షేత్రస్థాయిలో పరిశీలించారు.వరద పరిస్థితులను, నీటి నిల్వను, ప్రజలకు కలుగుతున్న ఇబ్బందులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ ,ఆర్అండ్ఆర్ కాలనీలో వరదల సమయంలో నీరు ఇళ్లలోకి ప్రవేశించకుండా ఆర్ఎఫ్‌సీఎల్ యాజమాన్యం తక్షణమే అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కార చర్యలను రూపొందించాలని ఆదేశించారు.ఓసీ3 ప్రాంతంలో నిలిచిపోయిన వరద నీటిని యంత్రాల సహాయంతో అత్యంత వేగంగా తొలగించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నీటి నిల్వల వల్ల ఎలాంటి ప్రమాదాలు తలెత్తకుండా నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు.ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద ప్రవాహాలు వచ్చే అవకాశం ఉన్నందున అన్ని శాఖల అధికారులు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజలకు ఎప్పటికప్పుడు హెచ్చరికలు జారీ చేస్తూ, ప్రమాదకర ప్రాంతాలకు వెళ్లకుండా అవగాహన కల్పించాలని, అవసరమైనచోట సహాయక బృందాలను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు, పారిశుద్ధ్య పనులు, తాగునీటి సరఫరా, విద్యుత్ సరఫరా వంటి మౌలిక సేవల్లో ఎలాంటి అంతరాయం కలగకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ పర్యటనలో సంబంధిత శాఖల అధికారులు, మున్సిపల్ అధికారులు, ఆర్ఎఫ్‌సీఎల్ ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దు

- పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా
- అత్యవసర పరిస్థితుల్లో వెంటనే డయల్-100 లేదా సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించండి

**విశాల భారతి గోదావరిఖని**



గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో కమిషనరేట్ పరిధిలోని ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. పెద్దపల్లి,మంచిర్యాల జోన్లలోని పోలీసు యంత్రాంగం నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటుందని తెలిపారు.ఎవరైనా ఆపదలో చిక్కుకున్నట్లయితే వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్ 100కు సమాచారం అందించి పోలీసుల సహాయం పొందవచ్చని సూచించారు. అధికారులు జారీ చేసే సూచనలను తప్పనిసరిగా పాటిస్తూ పోలీసు శాఖకు సహకరించాలని కోరారు. పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల్లో భారీవర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకు రావద్దని సూచించారు. ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకొని కమిషనరేట్ పరిధిలోని డ్యామ్‌లు, పర్యాటక ప్రాంతాలను తాత్కాలికంగా మూసివేయడం జరిగిందని,సాధారణ పరిస్థితులు నెలకొనే వరకు ఎవరూ అక్కడికి వెళ్లరాదని సూచించారు. ప్రజలకు ఎలాంటి ప్రమాదం తలెత్తకుండా పోలీసు శాఖ తరఫున అన్ని ముందస్తు భద్రతా చర్యలు చేపట్టినట్లు తెలిపారు.ప్రజలు పోలీసుల సూచనలు, సలహాలను పాటిస్తూ సహకరించాలని, ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు, వంకలు,కాలువలు, నదులు, రిజర్వాయర్లు, చెరువుల వద్దకు వెళ్ల రాదు. చెట్ల కింద, శిథిలావస్థలో ఉన్న భవనాల్లో లేదా పాడైన నిర్మాణాల వద్ద ఆశ్రయం పొందరాదు. విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు తాకరాదు. ఎట్టి పరిస్థితుల్లోనూ చెరువులు,నాలాలు, డ్యామ్‌లు, జలపాతాలు (వాటర్ ఫాల్స్) వద్దకు వెళ్ల రాదు.చేపల వేట కోసం కూడా వెళ్లకూడదు. అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే ఇంటి నుంచి బయటకు రావాలి. స్థానిక రెవెన్యూ, నీటిపారుదల, పంచాయతీరాజ్, విద్యుత్,ఆర్అండ్‌బీ, వైద్య శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ,వరదల కారణంగా రహదారులు దెబ్బతిన్న లేదా నీట మునిగిన ప్రాంతాల్లో ప్రజలు వెళ్లకుండా ఇరువైపులా బ్యారికేడ్లు,ప్లాస్టిక్ కోన్‌లు,హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోని చెరువులు, కుంటలు,అలుగులు, ప్రధానరహదారులపై ప్రవహిస్తున్న వాగులు, వంకల వద్ద నీటి ప్రవాహాన్ని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ పోలీసు అధికారులు,సిబ్బంది అన్ని జాగ్రత్త చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. వరద నీటి కారణంగా చెరువులు, కుంటలు నిండి కట్టలు తెగిపోయే ప్రమాదం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వాహనదారులు అత్యంత జాగ్రత్తగా ప్రయాణించాలి. వర్షాల కారణంగా రహదారులు దెబ్బతినడం, గుంతలు ఏర్పడి వాటిలో నీరు నిల్వ ఉండడం వల్ల ప్రమాదాలు సంభవించే అవకాశం ఉంది.కాబట్టి నెమ్మదిగా, అప్రమత్తంగా ప్రయాణించాలని సూచించారు. కల్వర్టులు,చిన్న వంతెనలపై నీరు ప్రవహిస్తున్న సమయంలో వాహనాలతో వాటిని దాటేందుకు ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రయత్నించరాదని హెచ్చరించారు. ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచినట్లు, కమిషనరేట్ పరిధిలో ప్రత్యేక శిక్షణ పొందిన 30 మంది సిబ్బంది అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే డయల్100కు సమాచారం అందించాలని, పోలీసు సిబ్బంది 24 గంటల పాటు సహాయక చర్యలకు సిద్ధంగా ఉంటారని పోలీస్ కమిషనర్ తెలిపారు.

## కోర్టు కాంప్లెక్స్ నిర్మాణ నిధుల మంజూరుకు కృషి

**ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి**




కోదాడ, (విశాలభారతి): కోదాడ పట్టణంలో నిర్మాణంలో ఉన్న నాలుగు కోర్టు కాంప్లెక్స్‌ల భవన నిర్మాణ పనులకు త్వరితగతిన నిధులు మంజూరు చేయిస్తానని, అలాగే స్థానికంగా అదనపు జిల్లా న్యాయస్థానం (అడిషనల్ డిస్ట్రిక్ట్ కోర్టు) ఏర్పాటుకు శాయశక్తులా కృషి చేస్తానని కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి స్పష్టం చేశారు. గురువారం కోదాడ బార్ అసోసియేషన్ అధ్యక్షులు చింతకుంట్ల లక్ష్మీనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో ఎగ్జిక్యూటివ్ బాడీ ప్రతినిధులు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి మాట్లాడుతూ.. న్యాయవాదులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. నిర్మాణంలో ఉన్న కోర్టు భవనాలను త్వరితగతిన పూర్తి చేసేలా ప్రభుత్వం నుంచి నిధులు విడుదల చేయిస్తామన్నారు. ప్రజలకు సత్వర న్యాయం అందించేందుకు అదనపు జిల్లా కోర్టు ఏర్పాటు ఎంతో అవసరమని, ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. అంతేకాకుండా, అర్హులైన న్యాయవాదులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూస్తానని ఆమె హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు గట్ల నరసింహారావు, ప్రధాన కార్యదర్శి రామిశెట్టి రామకృష్ణ, జాయింట్ సెక్రటరీ జానీ పాషా, ట్రెజరర్ కోడూరు వెంకటేశ్వరరావు, కల్చరల్ సెక్రటరీ గాలి శ్రీనివాస్ నాయుడు, మహిళా ప్రతినిధులు ధనలక్ష్మి, హేమలత, దుర్గ, పెద్దబ్బాయి, శ్రీను, నాగులు పాషా, సీతారామరాజు, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

## ఎల్లంపల్లి ప్రాజెక్టును, గోదావరి ఘాట్‌ను పరిశీలించిన ఏసీపీ ఎం. రమేష్



**విశాల భారతి ఎల్లంపల్లి:** ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గోదావరిఖని ఏసీపీ ఎం. రమేష్, రామగుండం సీఐ కృష్ణ కుమార్, గోదావరిఖని వన్ టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేన రెడ్డి తో కలిసి ఎల్లంపల్లి ప్రాజెక్టు ను సందర్శించి ప్రస్తుత నీటి ప్రవాహం వివరాలు ప్రాజెక్ట్ వివరాలు గురించి తెలుసుకోవడం జరిగింది. ప్రస్తుతం ఎల్లంపల్లి ప్రాజెక్ట్ నుండి దిగువకు 04 లక్షల క్యూ సెక్ ల వాటర్ విడుదల చేయడం జరుగుతుంది. కావున దిగువ ఉన్న ప్రతి ఒక్కరు కూడా అప్రమత్తంగా ఉండి ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. అదేవిదంగా సమ్మక్క దేవాలయం సమీపంలోని గోదావరి బ్రిడ్జి వద్ద గోదావరి ఘాట్ ప్రాంతాన్ని సందర్శించి, ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి గోదావరి నదిలోకి నీటి విడుదలకు ముందు నదిలోని నీటి ప్రవాహ పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా గోదావరి పరివాహక ప్రాంతంలోని గ్రామాల ప్రజలు, మత్స్యకారులు, నదీ తీర ప్రాంతాలకు వెళ్లే వారు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అధికారులు జారీ చేసే హెచ్చరికలను తప్పనిసరిగా పాటించాలని, అవసరం లేకుండా నదిలోకి దిగడం, చేపల వేటకు వెళ్లడం, సెల్ఫీలు తీసుకునేందుకు నది ఒడ్డుకు చేరుకోవడం వంటి ప్రమాదకర చర్యలకు దూరంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల భద్రత కోసం పోలీసు శాఖ నిరంతరం పరిస్థితిని పర్యవేక్షిస్తోందని, ఎలాంటి అత్యవసర పరిస్థితులు తలెత్తినా వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని అధికారులు తెలిపారు. రామగుండం ఎస్ ఐ సంధ్య రాణి, అంతర్గం ఎస్ ఐ వెంకట్ ఉన్నారు.

## ఎస్సై శోభన్ బాబుకి ఘనసన్మానం




**మునుగోడు విశాల భారతి :** మునుగోడు మండలం నూతన ఎస్సైగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన శోభన్ బాబును గురువారం రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు వట్టికోటి శేఖర్ కోతులారం గ్రామ సర్పంచ్ జాల జంగయ్య కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి మర్యాదపూర్వకంగా శాలువా తో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పందుల పూలమ్మ అంజయ్య, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గుండు చెన్న కృష్ణయ్య,పందుల గోపాల్,సాయినాథ్ గౌడ్, కర్నాటి వెంకటేష్, వట్టికోటి ప్రశాంత్, దొడ్డి జాజుల స్వామి, కట్టేకుంట్ల నరేష్, గుత్తి శివ తదితరులు పాల్గొన్నారు

## పోక్సో కేసులో ఇద్దరు అరెస్ట్

**డోర్నకల్, విశాల భారతి:** పోక్సో కేసులో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు దంతాలపల్లి ఎస్సై రవికుమార్ తెలిపారు.ఎస్సై వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా నూతనకల్ మండలం ఎర్రపహాడ్ గ్రామానికి చెందిన మంగళపల్లి శ్రీనివాస్ (24) అనే వ్యక్తి మైనర్ బాలికను ప్రేమ పేరుతో వేధించి, ఆమెను తీసుకెళ్లినట్లు బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు మంగళపల్లి శ్రీనివాస్‌ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా న్యాయస్థానం రిమాండ్ విధించింది.అదే కేసులో మైనర్ బాలికకు, ప్రధాన నిందితుడికి ఆశ్రయం కల్పించిన మంగళపల్లి గంగాధర్‌ను కూడా పోలీసులు అరెస్ట్ చేశారు. అతడిని కోర్టులో హాజరుపరచగా న్యాయస్థానం రిమాండ్‌కు పంపింది.పోక్సో కేసుల్లో నిందితులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని దంతాలపల్లి ఎస్సై రవికుమార్ తెలిపారు.

## ఫోటో ఎగ్జిబిషన్ పోస్టర్ ఆవిష్కరణ

**విశాల భారతి గూడూరు:** గూడూరు మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహం వద్ద సామాజిక అధ్యయన వేదిక ఆధ్వర్యంలో తెలంగాణ జాతిపిత ప్రొఫెసర్ జయశంకర్ 92వ జయంతి ఉత్సవాల్లో భాగంగా ఫోటో ఎగ్జిబిషన్ పోస్టర్ ఆవిష్కరణ ఆగస్టు 6న వరంగల్ కాకతీయ విశ్వవిద్యాలయం ఎస్ డి ఎల్ సి ఇ సెమినార్ హాల్లో ఉంటుంది .ఈ సెమినార్ లో విజయవంతం చేయండని పిలుపునివ్వడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డాక్టర్ రిటైర్ డిప్యూటీ డి ఎం అండ్ హెచ్ ఓ మహబూబాబాద్ అంబాల అంబరీష హాజరై మాట్లాడుతూ ఈ ఫోటో ఎగ్జిబిషన్లో తెలంగాణ సిద్ధాంతకర్త జయశంకర్ యొక్క విద్యార్థి దశ నుంచి తెలంగాణ ఉద్యమ ప్రస్థానం వరకు సంపూర్ణంగా ఛాయాచిత్రాల ప్రదర్శన కలదు. తెలంగాణ ఉద్యమానికి జయశంకర్ ఇచ్చిన బావ జల వ్యక్తికరణ కోట్లాదిమంది తెలంగాణ ఉద్యమకారులను చైతన్యపరిచింది. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం జయశంకర్ కృషి వల్లనే అందుకు తెలంగాణ పౌర సమాజమంతా సార్ కు రుణపడి ఉంది. ఆయనను స్మరించు కోవడం ఆయన బావా జలాన్ని రాబోయే తరాలకు అందించే బాధ్యత మన అందరిదీ అందులో భాగంగానే ఈ ఫోటో ఎగ్జిబిషన్ కార్యక్రమం నిర్వహిస్తున్నాం. పార్నాంది రామయ్య సామాజిక అధ్యయన వేదిక రాష్ట్ర అధ్యక్షులు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారులు, ప్రజాస్వామ్యవాదులు, జయశంకర్ వెంట ఆయన ఆలోచనలతో నడిచిన యావత్ ప్రజాసంఘాలు కుల సంఘాలు ఇతర వ్యక్తులు సంస్థలు సమూహాలు హాజరై విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాం . ఈ కార్యక్రమంలో సామాజిక అధ్యయన వేదిక జిల్లా ఉపాధ్యక్షులు మోకాళ్ల వెంకన్న, మండల నాయకులు చుంచ బాలయ్య, గుండ గాని కృష్ణమూర్తి, జన్ను సారయ్య, అంబేద్కర్ యువజన సంఘం నాయకులు, సృజన్ రావు తంగళ్ళపల్లి కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



# సురంగల్ 13వ వార్డులో మంచినీటి పైప్‌లైన్ పనుల ప్రారంభం

**వార్డు అభివృద్ధికి ప్రాధాన్యం : కౌన్సిలర్ గడ్డం లక్ష్మీవెంకట్ రెడ్డి**



**మొయినాబాద్ జూలై 30(విశాల భారతి):** మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని సురంగల్ 13వ వార్డులో మంచినీటి సమస్య పరిష్కారానికి మిషన్ భగీరథ పైప్‌లైన్ పనులను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వార్డు కౌన్సిలర్ గడ్డం లక్ష్మీవెంకట్ రెడ్డి మాట్లాడుతూ, వార్డు ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వార్డు అభివృద్ధికి అవసరమైన పనులను దశలవారీగా చేపడతామని, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తమ దృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. వార్డు అభివృద్ధికి ప్రజల సహకారం కూడా అవసరమని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు గడ్డం వెంకట్ రెడ్డి, విక్రంరెడ్డి, మహబూబ్, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# మొక్కలు నాటండి.. ప్రాణాలను కాపాడుకోండి

**మాజీ కార్పొరేటర్ కొత్త రామారావ్**




**కుషాయిగూడ, విశాలభారతి:** ప్రతి ఒక్కరు తమవంతు బాధ్యతగా మొక్కలు నాటాలని, దాని ద్వారా అందరి ప్రాణాలు సురక్షితంగా ఉంటాయని కాప్రా మాజీ కార్పొరేటర్ కొత్త రామారావ్ అన్నారు. లయన్స్ ఇంటర్నేషనల్ జిల్లా 320- హెచ్ గ్లోబల్ కాజెస్ సెక్రటరీ లయన్ కొత్తపల్లి రాంబాబు ఆధ్వర్యంలో, ఎన్ఎస్ఐసి క్యాంపస్ లో 500పైగా మొక్కలు నాటారు. ఈ కార్యక్రమాన్ని హెచ్ఎండీఏ అర్బన్ ఫారెస్ట్రీ విభాగం, ఎన్ఎస్ఐసి, ఈసిఐఎల్ సహకారంతొ నిర్వహించారు. మాజీ కార్పొరేటర్, లయన్ కొత్తరామారావ్ అతిథులను స్వాగతం పలికి సైనిక్పురి క్రాస్ రోడ్ నుండి ఎన్ఎస్ఐసి క్యాంపస్ వరకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిస్తూ కార్ ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీలో సుమారు 57కు పైగా కార్లు పాల్గొన్నాయి. కార్యక్రమానికి ముఖ్య అతిధిగా జిల్లా గవర్నర్, లయన్ అశోక్ కుమార్ స్వైన్, ఎన్ఎస్ఐసి జనరల్ మేనేజర్, ఎన్ఎస్ఐసి సీనియర్ మేనేజర్ ఆనంద్ కుమార్ లు మాట్లాడుతూ ఈరోజు మనం నాటిన ప్రతి మొక్క రాబోయే తరాలకు ప్రాణవాయువును అందిస్తుందని, ఈ లయనిస్టిక్ సంవత్సరంలో ప్రతి లయన్ కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షించాలని కోరారు. అలాగే లయన్స్ క్లబ్బు సమాజానికి చేస్తున్న సేవలు ఎంతో ఆదర్శప్రాయమని, పర్యావరణ పరిరక్షణ కోసం చేపట్టిన ఈ కార్యక్రమం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో లయన్ మెంబర్స్ తదితరులు పాల్గొన్నారు.

# అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తి అరెస్ట్

**500 ఫైన్, ఒకరోజు జైలు శిక్ష**



**కుషాయిగూడ, విశాలభారతి:** మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ఓ వ్యక్తికి జైలు శిక్ష విధించింది మల్కాజిగిరి న్యాయస్థానం. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జవహర్ నగర్ పోలిస్టేషన్ పరిధిలోని యాప్రాల్ లో నివసించె రామ్ షకల్ ఠాకూర్ (42) అనే వ్యక్తి కుషాయిగూడ ప్రాంతంలో రోడ్డు మీద నడుచుకుంటూ వెళుతున్న మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. దానితో బాధిత మహిళలు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు నిందితుడు ఠాకూర్ ను అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేసి కుషాయిగూడ స్పెషల్ మెట్రో పాలిటన్ మెజిస్ట్రేట్ కోర్ట్ లో హాజరు పరిచారు. విచారించిన న్యాయస్థానం నిందితుడు ఠాకూర్ కు 500 జరిమాన, ఒక రోజు జైలు శిక్ష విధించారని సబ్ ఇన్స్పెక్టర్ సుధాకర్ రెడ్డి తెలిపారు.

# తప్పులు చేయకండి.. శిక్షలు అనుభవించకండి



**కుషాయిగూడ, విశాలభారతి:** సరదాలకోసం తప్పులు చేసి జీవితాలు నాశనం చేసుకోకుండా, సవ్యంగా ఉండాలని, అనవసరంగా శిక్షలు అనుభవించకుండా సరైన దారిలో నడవాలని పలువురు నిందితులకు దిశానిర్దేశం చేశారు మల్కాజిగిరి న్యాయస్థానం. కుషాయిగూడ పోలిస్టేషన్ పరిధిలో పబ్లిక్ ప్లేస్ లో మధ్యం తీసుకుంటున్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. సిటీ పోలీస్ సెక్షన్ 70 (బి) క్రింద కాప్రా సర్కిల్ పరిధిలో నివసించె అభినయ్ (28), బాలకృష్ణ (30) అనే ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసి మల్కాజిగిరి స్పెషల్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్ట్ లో హాజరు పరిచారు. కేసు వివరాలు పరిశీలించిన కోర్ట్ ఇద్దరిని దోషులుగా నిర్ధారించి, ఒకరోజు సామాజిక సేవా చేయాలని శిక్ష విధించింది. దానితో సబ్ ఇన్స్పెక్టర్ సతీష్ నిందితులు ఇద్దరితో చెత్త నిండిపోయిన పలు ప్రాంతాల్లో క్లీనింగ్ చేయించారు.

# డ్వాక్రా భవనం అంగన్వాడి సెంటర్లను సందర్శించిన ఎంపీడీవో రాధా రాణి



**విశాల భారతి, ఇబ్రహీంపట్నం:** యాచారం మండల పరిధిలోని గున్ గల్ గ్రామంలో గురువారం నిర్మాణంలో ఉన్న డ్వాక్రా భవనము, అంగన్వాడీ సెంటర్ 1 లను పెన్షన్లు పంపిణీ కార్యక్రమాలను సందర్శించారు. ఈ కార్యక్రమంలో, పంచాయతీ కార్యదర్శి శోభారాణి , మచ్చ అనిల్ కుమార్ వార్డు సభ్యులు పంతంగి సుగుణమ్మ , పంతంగి మహేష్ , కొంగర సాయిచరణ్ తదితరులు పాల్గొన్నారు.

# నాగోల్ పోలీస్‌స్టేషన్‌కు ఇద్దరు కొత్త ఎస్సైలు

- **బాధ్యతలు స్వీకరించిన సూర్య నాయక్, మమతారెడ్డి**
- **ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సీఐ మక్బూల్ జానీ సూచన**



**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :** నాగోల్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీపై వచ్చిన సబ్ ఇన్‌స్పెక్టర్లు సూర్య నాయక్, మమతారెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. పోలీస్‌స్టేషన్‌లో సీఐ మహమ్మద్ మక్బూల్ జానీ సమక్షంలో వారు రిపోర్ట్ చేయగా, విధుల బాధ్యతలను అధికారికంగా అప్పగించారు. 2014 బ్యాచ్‌కు చెందిన ఎస్సై సూర్య నాయక్ గతంలో చిక్కడపల్లి, బేగంపేట, తిరుమలగిరి, హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్లతో పాటు మల్కాజిగిరి ట్రాఫిక్ విభాగంలో సేవలందించారు. అలాగే రోడ్డు భద్రత విభాగానికి బదిలీ అయిన ఎస్సై వేణుగోపాల్ స్థానంలో 2024 బ్యాచ్‌కు చెందిన ఎస్సై మమతారెడ్డి జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ నుంచి నాగోల్‌కు బదిలీపై వచ్చి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ మహమ్మద్ మక్బూల్ జానీ ఇద్దరు అధికారులను అభినందిస్తూ, ప్రజలకు సత్వర, పారదర్శక, నాణ్యమైన పోలీసు సేవలు అందించేలా కర్తవ్య నిర్వహణలో అంకితభావంతో పనిచేయాలని సూచించారు. కొత్త బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టాలని ఆకాంక్షించారు.

# ఆగస్టు 4న హైదరాబాద్‌లో చేనేత సహకార సంఘాల సభ్యుల సదస్సు

- **చిట్యాలలో కరపత్రాల ఆవిష్కరణ**
- **క్యాష్ క్రెడిట్ రుణమాఫీ చేయాలి**
- **చేనేత సంఘాల బలోపేతానికి కృషి చేయాలి**
- **ఏకగ్రీవ సంఘాలకు గ్రాంట్ ఇవ్వాలి**

**చిట్యాల విశాల భారతి**




హైదరాబాద్, ఆటోనగర్ లోని కర్నాటి గార్డెన్స్‌లో తెలంగాణ చేనేత సహకార సంఘాల అధ్యక్షులు, పాలకవర్గ సభ్యులతో సదస్సును నిర్వహించనున్నట్లు తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంజి మురళీధర్ తెలిపారు. ఈ సమావేశానికి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సహకార సంఘాల అధ్యక్షులు, పాలకవర్గ సభ్యులు పెద్దఎత్తున హాజరు కావాలని ఆయన పిలుపునిచ్చారు. పాలకవర్గాలను ఘనంగా సన్మానించి సొసైటీలకు మెమెంటోలు అందివ్వనున్నట్లు తెలిపారు. నల్గొండ జిల్లా, చిట్యాల చేనేత సహకార సంఘం పాలకవర్గంతో కలిసి ఆయన గురువారం చిట్యాల లో కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వాలు గత 13 సంవత్సరాలుగా చేనేత సంఘాలకు ఎన్నికలు నిర్వహించలేదని, తెలంగాణ చేనేత కార్మిక సంఘం ప్రభుత్వం పై ఒత్తిడి చేయడంతో ఎన్నికలు జరిపిందని గుర్తు చేశారు. సొసైటీలలో ఉన్న పాత అప్పులను ప్రభుత్వాలు ఇప్పటివరకు పూర్తిగా మాఫీ చేయలేదని విమర్శించారు. చేనేత సహకార సంఘాల క్యాష్ క్రెడిట్ రుణాలు రాష్ట్రవ్యాప్తంగా కనీసం రూ.30 కోట్లు కూడా ఉండవని, రైతులు, ఇతర వ్యాపారుల మాదిరిగానే చేనేత సంఘాల రూ.30 కోట్ల రుణాలను కూడా ప్రభుత్వం పూర్తిగా మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. హైదరాబాదులో జరిగే సదస్సుకు ముఖ్యఅతిథిగా మాజీ ఐఏఎస్ ఆఫీసర్ మునాస వెంకటేశం హాజరై సహకార సంఘాల చట్టాలపై, నిర్వహణపై సభ్యులకు అవగాహన కల్పిస్తారని తెలిపారు. ఈ సదస్సుకు సహకార సంఘాల నాయకులు, కార్మికులు అందరూ కలిసికట్టుగా వచ్చి సద్వినియోగం చేసుకోవాలని గంజి మురళీధర్ విజ్ఞప్తి చేశారు. చేనేత సహకార సంఘాల క్యాష్ క్రెడిట్ రుణాలను మాఫీ చేయడంతో పాటు, త్రిఫ్ట్ ఫండ్ డబ్బులను వెంటనే బ్యాంకుల ద్వారా విడుదల చేయాలని కోరారు. టెస్కో ద్వారా బెస్ట్ మెటీరియల్స్, బెడ్‌షీట్లు, టవల్స్ తదితర వస్త్రాలను టెండర్లను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించవద్దని దీనివల్ల చేనేత సహకార సంఘాల సభ్యులకు ఉపాధి లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నిబంధనను ప్రభుత్వం విరమించుకొని హాస్టళ్లు, గురుకుల పాఠశాలలు, ప్రభుత్వ సంస్థల విద్యార్థులకు అందాల్సిన చేనేత వస్త్రాల ఆర్డర్లను వెంటనే నేరుగా చేనేత సొసైటీలకే కేటాయించాలని డిమాండ్ చేశారు. ఆగస్టు 7న జాతీయ చేనేత దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని ఆ రోజున చేనేత సంఘాల క్యాష్ క్రెడిట్ రుణమాఫీని ప్రకటించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. చేనేత సహకార సంఘాల బలోపేతానికి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏకగ్రీవంగా ఎన్నికైన చేనేత సహకార సంఘాలకు ప్రభుత్వం ప్రత్యేక గ్రాంటును ప్రకటించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కందగట్ల గణేష్, చిట్యాల చేనేత సహకార సంఘం అధ్యక్షులు గంజి సుధాకర్, ప్రధాన కార్యదర్శి చెరుపల్లి శ్రీనివాసులు, ఉపాధ్యక్షులు మిర్యాల వెంకటేశ్వర్లు, కోశాధికారి కోట రాంబాబు, డైరెక్టర్లు వడ్డేపల్లి రాములు పాల్గొన్నారు.

# రాజేంద్రనగర్ జోన్‌లో గణేష్ ఉత్సవాల ఏర్పాట్లపై కీలక సమీక్ష




**రాజేంద్రనగర్, విశాల భారతి :** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జిహెచ్ఎంసి ) పరిధిలోని రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ కార్యాలయంలో రానున్న గణేష్ ఉత్సవాలు-2026ను పురస్కరించుకుని కీలక సమీక్ష సమావేశం నిర్వహించారు. జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వినాయక చవితి ఉత్సవాలు మరియు నిమజ్జన కార్యక్రమాలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా ప్రశాంతంగా, విజయవంతంగా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై ఎమ్మెల్యే అధికారులతో విస్తృతంగా చర్చించారు. ఉత్సవాల నిర్వహణలో ఎటువంటి లోపాలు లేకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆయన స్పష్టంగా సూచించారు. జీహెచ్ఎంసీ, పోలీసు శాఖ, విద్యుత్ శాఖ, రెవెన్యూ విభాగం, జలమండలి తదితర ప్రభుత్వ శాఖల అధికారులు సమిష్టిగా కృషి చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ముఖ్యంగా వినాయక మండపాల ఏర్పాటు చేసే ప్రాంతాలు, నిమజ్జన ఊరేగింపు మార్గాలు పరిశుభ్రంగా, సురక్షితంగా ఉండేలా ముందస్తు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. రోడ్ల మరమ్మతులు తక్షణమే పూర్తి చేయడం, డ్రైనేజీ సమస్యలను పరిష్కరించడం, చెత్త తొలగింపు పనులను వేగవంతం చేయడం, తగినంత లైటింగ్ ఏర్పాట్లు చేయడం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు సూచించారు. అలాగే నిమజ్జన సమయంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందుగానే మార్గాల ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని చెప్పారు. ప్రజలు సైతం అధికారులతో సహకరించి ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించేందుకు ముందుకు రావాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఎటువంటి అప్రమత్తత లోపం లేకుండా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో వివిధ శాఖల ఉన్నతాధికారులు, పోలీసు అధికారులు, జీహెచ్ఎంసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# చెవులకందిన శబ్దం.. కళ్లలో ఆనంద బాష్పాలు

- **వృద్ధురాలికి బాసటగా వడ్డేపల్లి**
- **నేనున్నాను' అంటూ భరోసానిచ్చిన బీజేపీ సీనియర్ నాయకుడు రాజేశ్వరరావు**

**కూకట్‌పల్లి - విశాల భారతి**




వయోభారంతో పాటు వినికిడి లోపంతో సతమతమవుతున్న ఒక నిస్సహాయ వృద్ధురాలి జీవితంలో వెలుగులు నింపేందుకు ప్రముఖ రాజకీయ నాయకుడు, బీజేపీ సీనియర్ నాయకుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు ముందుకు వచ్చిన సంఘటన స్థానికంగా తీవ్ర భావోద్వేగాన్ని నింపింది. రాజేశ్వరరావు కనబరిచిన ఉదారత, మానవతా దృక్పథం పట్ల స్థానిక ప్రజల నుంచి విశేష ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి. కూకట్‌పల్లి వెంకటేశ్వర నగర్ ప్రాంతానికి చెందిన సుమారు 80 ఏళ్ల వయసున్న విరమ్మ అనే వృద్ధురాలు గత కొంతకాలంగా రెండు చెవులూ వినిపించక తీవ్ర అవస్థలు పడుతోంది. ధ్వని ప్రపంచానికి దూరమై శోకసంద్రంలో మునిగిపోయిన ఆమె, తన కుమార్తెతో కలిసి వడ్డేపల్లి రాజేశ్వరరావును కలిసి తన అవేదనను వ్యక్తం చేసుకుంది. ఆమె పరిస్థితిని ప్రత్యక్షంగా చూసి చలించిపోయిన ఆయన, క్షణం కూడా ఆలస్యం చేయకుండా తక్షణమే స్పందించారు. ఆమెను సొంత కుటుంబసభ్యురాలిగా భావించి మనోధైర్యాన్ని నూరిపోసిన రాజేశ్వరరావు, వెంటనే సంబంధిత ఈఎన్‌టీ వైద్య నిపుణుల వద్దకు తీసుకెళ్లారు. అవసరమైన వైద్య పరీక్షలన్నీ దగ్గరుండి చేయించి, ఆమె వినికిడి లోపానికి తగిన ఆధునిక డిజిటల్ వినికిడి పరికరాన్ని సొంత ఖర్చులతో కొనుగోలు చేసి అందజేశారు. పరికరాన్ని అమర్చిన వెంటనే మళ్లీ మాటలు, శబ్దాలు స్పష్టంగా వినిపించడంతో ఆ వృద్ధురాలు తీవ్ర భావోద్వేగానికి లోనై కంటతడి పెట్టుకుంది. తనకు మళ్లీ కొత్త జీవితాన్ని, వినికిడి శక్తిని ప్రసాదించిన రాజేశ్వరరావుకు చేతులు జోడించి కృతజ్ఞతలు తెలిపింది.ఈ సందర్భంగా రాజేశ్వరరావు మాట్లాడుతూ.. నిస్సహాయ స్థితిలో ఉన్న వృద్ధులకు, పేదలకు సహాయపడటంలోనే నిజమైన తృప్తి ఉందన్నారు. వృద్ధాప్యంలో ఎవరూ లేక ఇబ్బందిపడే వారికి సమాజం అండగా నిలవాలని పిలుపునిచ్చారు. విరమ్మకు భవిష్యత్తులో ఎలాంటి సమస్య వచ్చినా 'నేనున్నాను' అంటూ కొండంత అభయాన్నిచ్చారు. ఒక నాయకుడిలా కాకుండా ఆపద్బాంధవుడిలా నిలబడి వృద్ధురాలికి బాసటగా నిలిచిన రాజేశ్వరరావు సేవా దృక్పథాన్ని, విశాల హృదయాన్ని వెంకటేశ్వర నగర్ నివాసులు కొనియాడారు.

# ఓటు హక్కే ప్రజాస్వామ్యానికి బలం

- **ఎస్ఐఆర్ కేంద్రాలను సందర్శించిన మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి**
- **ఆగస్టు 3లోపు పేరు నమోదు చేసుకోవాలని అర్హులైన ఓటర్లకు పిలుపు**



**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :** భారత ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని హయత్‌నగర్ మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆగస్టు 3వ తేదీతో కార్యక్రమం ముగియనున్న నేపథ్యంలో రాఘవేంద్ర కాలనీ కమ్యూనిటీ హాల్, సాయినగర్ కమ్యూనిటీ హాల్‌లలో కొనసాగుతున్న నమోదు ప్రక్రియను సందర్శించి ఏర్పాట్లు, సిబ్బంది పనితీరు, ప్రజలకు అందుతున్న సేవలను సమీక్షించారు. ఈ సందర్భంగా నవజీవన్ రెడ్డి మాట్లాడుతూ.. ఇంకా ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోని అర్హులైన ప్రతి ఒక్కరూ ఆలస్యం చేయకుండా అవసరమైన పత్రాలతో ఎస్ఐఆర్ కేంద్రాలను సందర్శించి తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రతి ఓటు విలువైనదని, ఎన్నికల సంఘం చేపట్టిన ఈ ప్రత్యేక ప్రక్రియను ప్రజలందరూ సద్వినియోగం చేసుకుని ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.ఎస్ఐఆర్ నమోదు ప్రక్రియ సజావుగా కొనసాగేందుకు అధికారులు, సిబ్బంది కృషి చేస్తున్నారని ఆయన అభినందించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ హయత్‌నగర్ డివిజన్ అధ్యక్షులు గంగాని శ్రీనివాస్, కాలనీవాసులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సాయినాథుడిని దర్శించుకున్న శ్రీధర్ బాబు, మధుయాష్కి గౌడ్

**ప్రత్యేక పూజల్లో పాల్గొని బంగారు కిరీటం, బిల్లపత్ర మాలను సమర్పించిన కాంగ్రెస్ నేతలు**



**విశాల భారతి , అబ్దుల్లాపూర్‌మెట్ :** రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ గురువారం ఉదయం దిల్‌సుఖ్‌నగర్‌లోని సాయిబాబా దేవాలయాన్ని సందర్శించి సాయినాథుడిని దర్శించుకున్నారు.ఈ సందర్భంగా ఆలయంలో నిర్వహించిన అభిషేకం, ప్రత్యేక పూజల్లో పాల్గొన్న వారు స్వామివారికి బంగారు కిరీటం, బంగారు బిల్లపత్ర మాలను సమర్పించారు. రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, తెలంగాణ మరింత అభివృద్ధి చెందాలని సాయినాథుడిని ప్రార్థించారు. అనంతరం ఆలయ వేద పండితులు మంత్రి శ్రీధర్ బాబు, మధుయాష్కి గౌడ్‌లకు వేదాశీర్వచనం అందించగా, సాయిబాబా దేవాలయ కమిటీ ప్రతినిధులు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో టీపీసీసీ అధికార ప్రతినిధి వేదిరె యోగేశ్వర్ రెడ్డి, సీనియర్ నాయకులు తులసి శ్రీనివాస్, డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు సునీల్ బాబు, మాజీ అధ్యక్షులు వేణుగోపాల్ యాదవ్, శశిధర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ ప్రేమ్ నాథ్ గౌడ్, సాయిబాబా సంస్థాన్ ట్రస్ట్ చైర్మన్ లింగయ్య, నాయకులు బాబ్బూరి ఆనంద్ గౌడ్, దాము మహేందర్ యాదవ్, నాగార్జున రెడ్డి, శరత్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# అరే మైసమ్మ జంక్షన్ వద్ద డివైడర్ పనులతో ప్రజల ఆందోళన

**ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి డిమాండ్**



**రాజేంద్రనగర్, విశాల భారతి :** రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని బండ్లగూడ జాగిర్‌లో అరే మైసమ్మ ఆలయ జంక్షన్ వద్ద అధికారులు చేపడుతున్న రోడ్ విస్తరణ, డివైడర్ నిర్మాణ పనులు స్థానిక ప్రజలను, పాదాచారులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఆరే మైసమ్మ దేవాలయం సమీపంలో సుమారు మూడు అడుగుల ఎత్తులో పటిష్టంగా నిర్మిస్తున్న రోడ్ డివైడర్లు రోడ్డు దాటే వారికి పెద్ద సమస్యగా మారాయి. ప్రత్యేకంగా రోజురోజుకు పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీ, పాదచారుల రాకపోకలు పెరుగుతున్న నేపథ్యంలో ఈ ప్రాంతంలో రోడ్డు దాటడం ప్రమాదకరంగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఫుట్ ఓవర్ బ్రిడ్జి (దాటుటు వంతెన) నిర్మించాలని కోరుతూ స్థానిక ప్రజాప్రతినిధులు, కాలనీ వాసులు ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ సాగర్ గౌడ్ మాట్లాడుతూ, ఆరే మైసమ్మ దేవాలయానికి వచ్చే భక్తులు, ముసలివారు, పాఠశాల విద్యార్థులు, మహిళలు, దివ్యాంగులు జాతీయ రహదారిని దాటేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తరచూ ప్రమాదాలు జరిగే అవకాశమున్నందున ప్రజల భద్రత దృష్ట్యా అత్యవసరంగా ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. వినతిపత్రాన్ని స్వీకరించిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ సమస్యను పరిశీలించి సంబంధిత అధికారులతో చర్చించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

# విమాన భద్రతకు ముప్పు: లేజర్, స్కై బీమ్ లైట్లపై కఠిన నిషేధం

**రాజేంద్రనగర్, విశాల భారతి :** రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం (ఆర్జిఐఏ ) పరిసర ప్రాంతాల్లో విమానాల సురక్షిత రాకపోకలకు విఘాతం కలిగించే లేజర్ బీమ్, స్కై బీమ్, సెర్చ్ లైట్లు, మూవింగ్ బీమ్ లైట్లు వంటి అధిక తీవ్రత గల కాంతి పరికరాల వినియోగాన్ని పూర్తిగా నిషేధిస్తూ శంషాబాద్‌లో అవగాహన సమావేశం నిర్వహించారు. డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశానికి అదనపు పోలీసు కమిషనర్ (లా అండ్ ఆర్డర్) తఫ్సీర్ ఇక్బాల్, ఐపీఎస్ అధ్యక్షత వహించగా, డీసీపీ బి. రాజేష్, ఏసీపీలు ప్రదీప్ రెడ్డి, శ్రీకాంత్ గౌడ్, జీఎంఆర్ సంస్థ అధికారులు పాల్గొన్నారు. విమానాశ్రయం పరిసర ప్రాంతాల్లోని సుమారు 70 ఫంక్షన్ హాళ్లు, కన్వెన్షన్ హాళ్లు, ఫామ్ హౌస్‌ల యజమానులు హాజరయ్యారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, ఆకాశం వైపు ప్రసరించే లేజర్, స్కై బీమ్ లైట్లు పైలట్ల దృష్టిని మరల్చి టేకాఫ్, ల్యాండింగ్ సమయంలో ప్రమాదాలకు దారి తీసే అవకాశముందని హెచ్చరించారు. లైటింగ్ పరికరాలను వినియోగించరాదని, విమాన రాకపోకలకు ఆటంకం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై ఎయిర్‌క్రాఫ్ట్ రూల్స్ 1937, డీజీసీఏ మార్గదర్శకాలు, బీఎన్ఎస్ చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. విమాన భద్రత కోసం సంబంధిత నిర్వాహకులు అందరూ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు



# జర్నలిస్టుల ఇళ్లస్థలాల సమస్య పరిష్కారానికి, హెల్త్ కార్డుల సాధనకు కృషి

- టీయూడబ్ల్యూజె (ఐజేయు) రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి
- జిల్లాలో నంబర్ వన్ యూనియన్ గా టీయూడబ్ల్యూజె
- మండల స్థాయిలో కమిటీలు
- జర్నలిస్ట్ సమస్యలపై రాజీలేని పోరాటం
- జిల్లా అధ్యక్షులు ఎండీ సలీమ్ పాషా,జిల్లా కార్యదర్శి మేకల సత్యనారయణ



**సైబరాబాద్ - విశాల భారతి**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా చేపట్టిన ఫ్యూచర్ సీటిలో జర్నలిస్టులకు కేటాయిస్తున్న ఇండ్ల స్థలాలలో మొదటి ప్రాధాన్యత రంగారెడ్డి జిల్లాలోని అర్హులైన జర్నలిస్టులకు అవకాశాలు కల్పించాలని టియుడబ్ల్యూజె రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి కోరారు. గురువారం బాలాపూర్ మండలం బడంగ్ పేట్ కేంద్రంలో జరిగిన తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల సంఘం టియుడబ్ల్యూజె (ఐజేయు) బాలాపూర్ మండలం నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైనా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ.. భారత్ ఫ్యూచర్ సీటిలో హైద్రాబాద్ ప్రాంత జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నందున, అదే ప్రాంతంలో ఉన్న రంగారెడ్డి జిల్లాలోని గత 20 సంవత్సరాలుగా జర్నలిస్టులుగా పనిచేస్తున్న అర్హులైనవారందరికి కుడా ఇండ్ల స్థలాలను కేటాయించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నట్లు చెప్పారు. త్వరలోనే అర్హులైన జర్నలిస్టులందరికి ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో కార్పొరేట్ అసుపత్రుల్లో పనిచేసే విధంగా ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డితో సహ టియుడబ్ల్యూజె రాష్ట్ర అధ్యక్షులు విరాహత్ అలీ కృషి చేస్తున్నారని దీనికి రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు, యూనియన్ ద్వారా గతంలో హెల్త్ పాలసీ గడువు ముగిసిందని త్వరలోనే యూనియన్ సభ్యులందరికి 5 లక్షల ఆరోగ్య భీమా సౌకర్యం త్వరలో కల్పించనున్నట్లు హామి ఇచ్చారు. ఆరోగ్యభీమా, జీవిత భీమా గ్రూపులవారిగా చేసుకునేలా ప్రయత్నాలు కోనసాగించాలని సూచించారు.జర్నలిస్టుల సమస్యలపై టియుడబ్ల్యూజె రాజీలేని పోరాటం చేస్తుందని టియుడబ్ల్యూజె జిల్లా అధ్యక్ష్యకార్యదర్శులు సలీంపాషా, మేకల సత్యనారాయణలు అన్నారు. జిల్లాలోని అన్నీ మండల, నియోజకవర్గ కమిటీలు వేసి నంబర్ వన్ యూనియన్ గా టీ యూ డబ్ల్యూ జే నిలుస్తుందన్నారు.అన్నీ ప్రధాన పత్రికలు, చానళ్ళ రిపోర్టర్లతో పాటు సీనియర్ జర్నలిస్ట్ లు ఉన్న ఏకైక యూనియన్ టీయూడబ్ల్యూజే మాత్రమే అన్నారు. జర్నలిస్టుల దీర్ఘకాలిక సమస్యలపై తమ సంఘం నిరంతరం పనిచేస్తుందని అందులో భాగంగా అర్హులైన జర్నలిస్టులకు, అక్రిడిటేషన్ కార్డులు. హెల్త్ కార్డులు అందెలా కృషిచేస్తున్నామన్నారు. అనంతరం బాలాపూర్ మండలం నూతన కార్యవర్గాన్ని ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు. టీయూడబ్ల్యూజే బాలాపూర్ మండలం నూతన కమిటీ కార్యవర్గం అధ్యక్షుడు కె.మహిపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎస్. జయంత్, కోశాధికారి సి.శ్రావణ్ కుమార్ ప్రధాన సలహాదారులు అనంతుల శ్రీనివాస్,సలహాదారులు ఎం.భుజంగారెడ్డి,ఎండి.నిజాముద్దీన్,భూపాల్, శ్రీనివాస్, ఉపాధ్యక్షులు కె.శ్రీనివాస్ గౌడ్, ఏం.అమరేశ్వర్ రెడ్డి, ఆర్.రమేష్, సంయుక్త కార్యదర్శులు జి.శ్రీనివాస్,బొల్లంపల్లి రాంబాబు, కే.శ్రావణ్, ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు,జిల్లాకార్యవర్గ సభ్యులు ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే మాజీ జిల్లా అధ్యక్షులు అనంతుల శ్రీనివాస్,జిల్లా కోశాధికారి శశిపాల్ రెడ్డి,ఉపాధ్యక్షులు పాండు యాదవ్, ఎలాక్ట్రానిక్ మీడియా ఉపాధ్యక్షులు నర్సింహా,సంయుక్త కార్యదర్శులు దారుగుపల్లి సత్యనారాయణ, బొల్లంపల్లి ఆంజనేయులు, సూర్యనారాయణ,ఈసీ సభ్యులు సురేందర్,జంగయ్య,శేఖర్, కృష్ణ, రాజ్ కుమార్,సీనియర్ నాయకులు తదితరులు పాల్గొని జర్నలిస్టుల హక్కుల రక్షణకు స్థానిక కమిటీలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై దిశానిర్దేశం చేశారు.వివిధ పత్రికల విలేఖరులు,యూనియన్ ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.నూతనంగా ఎన్నికైన టీయూడబ్ల్యూజే బాలాపూర్ మండల కమిటీకి శుభాకాంక్షలు తెలిపి,సన్మానించారు.

## సురంగల్–వెంకటాపూర్ రహదారి దుస్థితి..

**ఎమ్మెల్యే స్పందించాలని ప్రజల డిమాండ్**





**మొయినాబాద్ జూలై 30(విశాలభారతి):** మొయినాబాద్ మండలంలోని సురంగల్ నుంచి వెంకటాపూర్ వెళ్లే ప్రధాన రహదారి భారీ గుంతలత దెబ్బతినడంతో వాహనదారులు, గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు రహదారి మరింత దెబ్బతిని గుంతలమయంగా మారడంతో ప్రతి రోజు ప్రయాణం ప్రమాదకరంగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఆస్పత్రులకు వెళ్లాల్సిన రోగులు, విద్యార్థులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని గ్రామస్థులు తెలిపారు. ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు పలుమార్లు దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కాలేదని ఆరోపించారు. స్థానిక ఎమ్మెల్యే కాలే యాదయ్య వెంటనే స్పందించి సురంగల్ -శ్రీరామ్ నగర్ వెంకటాపూర్ రహదారికి శాశ్వత మరమ్మతులు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. వర్షాకాలంలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున అధికారులు తక్షణ చర్యలు తీసుకుని రహదారిని వాహనాల రాకపోకలకు అనువుగా మార్చాలని కోరుతున్నారు.

## సర్ ప్రక్రియకు మరో నాలుగు రోజులే..


- అర్హులైన ఓటర్లందరూ తమ పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేయించుకోవాలి
- బిజెపి సీనియర్ నాయకులు తునుకోజు శ్రీనివాస్ చారి



**ముషీరాబాద్ విశాల భారతి:** సర్ ప్రక్రియకు మరో నాలుగు రోజులు మాత్రమే గడువు ఉందని, అర్హులైన ఓటర్లందరూ ఆగస్టు 3 తేదీ లోపు ఓటరు జాబితాలో తమ పేర్లను నమోదు చేయించుకోవాలని బిజెపి సీనియర్ నాయకులు తునుకోజు శ్రీనివాస్ చారి విజ్ఞప్తి చేశారు. తార్నాక డివిజన్ పరిధిలో ఇంటింటికి తిరిగి బిఎల్ఓలు అందజేసిన ఎన్యుమరేషన్ ఫామ్ లలో ఓటర్లు తమ వివరాలు రాసి గడువు లోపల తిరిగి వారికి అందజేయాలని సూచించారు. సకాలంలో ఎన్యుమరేషన్ ఫామ్ లలో వివరాలు రాసి బి ఎల్ ఓ లకు అందజేస్తే వారి పేర్లు ఓటర్ జాబితాలో నమోదు అవుతాయన్నారు. ఎన్యుమరేషన్ ఫామ్ లు తిరిగి ఇవ్వని వారి పేర్లు జాబితాలో నమోదు కావని తెలిపారు. ప్రతి ఓటు విలువైనదని,ఎస్ఐఆర్ ప్రక్రియలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని శ్రీనివాస్ చారి పిలుపునిచ్చారు. ఓటు హక్కు ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన అత్యంత విలువైన హక్కు అని, ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తయ్యేలోపు ప్రతి అర్హత కలిగిన ఓటరు తమ వివరాలను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## సాయిబాబా ఆశీస్సులతో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలి

- గురుపౌర్ణమి వేడుకల్లో మంచిరెడ్డి కిషన్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డి
- కొంగర కలాన్ సాయిబాబా దేవాలయంలో ప్రత్యేక పూజలు
- ప్రజలకు శుభాకాంక్షలు తెలిపిన బీఆర్ఎస్ నాయకులు



**విశాల భారతి ఇబ్రహీంపట్నం:** గురుపౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం కొంగర కలాన్ గ్రామంలో వెలసిన శ్రీశ్రీశ్రీ సాయిబాబా దేవాలయంలో బుధవారం భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి (బంటి) పాల్గొని సాయిబాబా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.అనంతరం ఆలయ అర్చకుల నుంచి ఆశీర్వచనాలు, తీర్థప్రసాదాలు స్వీకరించిన నాయకులు రాష్ట్ర ప్రజల సంక్షేమం, సుభిక్షం కోసం ప్రార్థించారు.ఈ సందర్భంగా మంచిరెడ్డి కిషన్ రెడ్డి, మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ గురుపౌర్ణమి భారతీయ సంస్కృతిలో అత్యంత పవిత్రమైన పర్వదినమని పేర్కొన్నారు. గురువులను గౌరవించే సంప్రదాయం ప్రతి ఒక్కరూ కొనసాగించాలని, శ్రీ సాయిబాబా ఆశీస్సులతో ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, ఐశ్వర్యాలతో సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. సాయిబాబా స్వామి దీవెనలు ప్రతి కుటుంబం పైన ఎల్లప్పుడూ ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెర్కోని రాజు, యాచారం మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రమేష్ గౌడ్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని జయప్రదం చేయండి

- ఆగస్టు 9న ప్రపంచ ఆదివాసి దినోత్సవం పండుగలా జరపాలి
- ఆదివాసుల ఆత్మగౌరవానికి ప్రపంచ ఆదివాసి దినోత్సవం ప్రతీక
- చట్టాలు హక్కుల రక్షణకై పోరాటానికి నాంది
- ఏజెన్సీ ఏరియాలో అధికారులే ఆదివాసి హక్కులను కాలరాస్తున్నారు
- ఆదివాసి భాషా సంస్కృతిని కాపాడేందుకై నడుం బిగించాలి
- ఆదివాసి మహిళలకు ప్రత్యేక ప్రాధాన్యత కల్పించాలి
- మహా జాతరల ప్రపంచ ఆదివాసీ దినోత్సవం జరగాలి



**భద్రాచలం, విశాల భారతి;**

ఆగస్టు 9న ప్రపంచ ఆదివాసి దినోత్సవం మహా జాతర ల జరపాలని ఆదివాసి సంక్షేమ పరిషత్ మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు కుంజా రమాదేవి మహిళా శక్తి నాయకురాలు కొంద్రు సుధారాణి, మహాజన సమితి ఆదివాసి మహిళ రాష్ట్ర కన్వీనర్ కంగాల రమణకుమారి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు ఒక ప్రకటన విడుదల చేస్తూ ఆదివాసి సమాజం కలిసికట్టుగా ప్రపంచమంతా ఆగస్టు 9వ తారీఖున ఆదివాసి దినోత్సవాన్ని ఘనంగా జరుపుకోవాలని వారు పేర్కొన్నారు. ప్రత్యేకించి తెలంగాణ రాష్ట్రంలో ప్రతి జిల్లా కేంద్రాల్లో ప్రభుత్వం ఆదివాసులను సమన్వయం చేసుకుంటూ నిధులు కేటాయించి ఘనంగా నిర్వహించేందుకు భారీ ప్లాన్ చేయాలని వారు కోరారు. ఏజెన్సీ ప్రాంతాల్లో చట్టాలను అమలు చేసే దాంట్లో అధికారుల నిర్లక్ష్యం కనిపిస్తుందని గిరిజనేత్రులకు వత్తాసు పలుకుతూ గిరిజన భూముల పైన గిరిజన పోడుల పైన అతి ఉత్సాహం చూపిస్తూ దాడులకు పూను కుంటున్నారని వారు ఆవేదన చెందారు. ప్రభుత్వం ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసులకు రక్షణ కవచాలుగా అధికారులు నిలిచేందుకు ఆదేశాలు జారీ చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివాసి భాషా సంస్కృతులను ప్రభుత్వం కాపాడాలని చట్టాలు పగడ్బందీగా అమలు చేయాలని ఆదివాసుల ఆత్మగౌరవం దెబ్బతినకుండా ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని వారు కోరారు. విద్యా, వైద్యం, ఉపాధి రంగాల్లో ఆదివాసులకు సముచిత న్యాయం చేయాలని ఆర్థికంగా, సామాజికంగా రాజకీయంగా ఆదివాసులను చైతన్యపరిచే దాంట్లో ప్రభుత్వం సంబంధిత అధికారులు శక్తి వంచన లేకుండా కృషి చేయాలని వారు తెలిపారు. ఇప్పటికే కొంతమంది అధికారుల నిర్లక్ష్యం వలన ఏజెన్సీ ప్రాంతాల్లో చట్టాలు నిర్వీర్యం అవుతున్నాయని ఏ ఒక్క చట్టం కూడా అమలకు నోచుకోవట్లేదని వారు ఆవేదన చెందారు. చట్టాలు కాగితాలకే పరిమితం అవుతున్నాయని క్షేత్రస్థాయిలో వాటిని రక్షించటంలో అధికారులు అలసత్వం కనిపిస్తుందని, ఇక పైన అలా జరగకుండా తగు చర్యలు చేపట్టాలని వారు అన్నారు. ఆదివాసుల వ్యవసాయానికి ప్రభుత్వం అన్ని రకాల వసతులు కల్పించాలని వ్యవసాయానికి ఏ రకమైన ఆటంకి లేకుండా చూడాలని దళారులను ఎండగట్టే దాంట్లో ప్రభుత్వ అధికారులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని వారు పేర్కొన్నారు. ఆగస్టు 9న జరగబోయే ప్రపంచ ఆదివాసి దినోత్సవం అందరూ సమిష్టిగా జయప్రదం చేసే దాంట్లో శక్తి వంచన లేకుండా ముందుకు రావాలని ఆదివాసి హక్కుల పరిరక్షణ, చట్టాలను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ కంకణ బద్ధులు కావాలని వారు పిలుపునిచ్చారు.

## అమిత్ షా బర్తరఫ్ చేయాలి




**ఎల్బీనగర్‌లో యువజన కాంగ్రెస్ వినూత్న నిరసన**

**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :**

నీట్ పేపర్ లీకేజీ ఘటనకు నిరసనగా ఢిల్లీలో శాంతియుతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులపై అమానుషంగా దాడి చేయించారని ఆరోపిస్తూ కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాను కేంద్ర మంత్రివర్గం నుంచి వెంటనే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ ఎల్‌బీనగర్ యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో గురువారం వినూత్న నిరసన కార్యక్రమం నిర్వహించారు.తెలంగాణ యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు జక్కిడి శివచరణ్ రెడ్డి ఆదేశాల మేరకు ఎల్‌బీనగర్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు శివకుమార్ ఆధ్వర్యంలో ఎల్‌బీనగర్ మాల్ మైసమ్మ ఫ్లైఓవర్‌పై నిరసన చేపట్టారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ విద్యార్థులపై జరిగిన పోలీసు చర్యలను తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య దేశంలో తమ హక్కుల కోసం శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులపై బలప్రయోగం చేయడం అత్యంత దురదృష్టకరమని విమర్శించారు. ఈ ఘటనకు కేంద్ర ప్రభుత్వం నైతిక బాధ్యత వహించాలని, విద్యార్థులపై జరిగిన చర్యలకు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాను వెంటనే కేంద్ర మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సాయిరాం రెడ్డి, నియోజకవర్గ ఉపాధ్యక్షులు సాయిరాం సామలేటి, ఇర్ఫాన్, సంజు గౌడ్, ప్రధాన కార్యదర్శులు రూత్విక్ రెడ్డి, జావేద్, సోషల్ మీడియా ఇన్‌చార్జ్ తిరుపతి, బీఎన్ రెడ్డి నగర్ డివిజన్ అధ్యక్షులు నేలపాటి రాజేష్, మన్సూరాబాద్ డివిజన్ అధ్యక్షులు కుశాల్, యువజన కాంగ్రెస్ నాయకులు ఆదిత్య, గణేష్, ఫర్హాన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారంలో జర్నలిస్టులు ముందుండాలి

**టీయూడబ్ల్యూజే అబ్దుల్లాపూర్‌మెట్ మండల అధ్యక్షుడిగా గుడెపు జగన్ కు ఘన సత్కారం**



**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :** టీయూడబ్ల్యూజే (తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్) అబ్దుల్లాపూర్‌మెట్ మండల అధ్యక్షుడిగా నియమితులైన గుడెపు జగన్ ను బహుజన్ సమాజ్ పార్టీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి గ్యార మల్లేష్ శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గ్యార మల్లేష్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యలను నిర్భయంగా అధికారుల, ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి జర్నలిస్టులు కృషి చేయాలని అన్నారు. సమాజానికి దిశానిర్దేశం చేసే బాధ్యత పాత్రికేయులపై ఉందని, ప్రజల గొంతుకగా పనిచేస్తూ ప్రజా ప్రయోజనాల పరిరక్షణలో ముందుండాలని ఆకాంక్షించారు.టీయూడబ్ల్యూజే మండల అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన గుడెపు జగన్ కు విజయవంతమైన పదవీకాలం ఉండాలని శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో బీఎస్పీ ఈసీ సభ్యుడు చిత్రం కృష్ణ, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ యంజాల ప్రహ్లాద్, అబ్దుల్లాపూర్‌మెట్ మండల ఆంధ్రజ్యోతి పాత్రికేయులు రాసాల వెంకటేశ్, పంగ శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల్ నియోజకవర్గంలో రూ. 76.45 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన



**ఉప్పల్ జూలై 30 విశాల భారతి :** ఉప్పల్ నియోజకవర్గంలో రూ. 76 కోట్ల 45 లక్షల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, వాణిజ్యం మరియు శాసన వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షులు తోటకూర వజ్రెష్ యాదవ్,ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందముల పరమేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా శ్రీధర్ బాబు మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతంగా అమలు చేస్తోందని తెలిపారు. ఉప్పల్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## హయత్‌నగర్ ట్రంక్‌లైన్‌పై ప్రభుత్వ నిర్లక్ష్యం

**నూతన పైప్‌లైన్‌ను వెంటనే నిర్మించాలి : మాజీ కార్పొరేటర్ సామా తిరుమల్ రెడ్డి డిమాండ్**





**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :** హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని జాతీయ రహదారిపై రాఘవేంద్ర హోటల్ సమీపంలో డ్రైనేజీ ట్రంక్‌లైన్ మరోసారి క్రుంగిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని హయత్‌నగర్ మాజీ కార్పొరేటర్ సామా తిరుమల్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం, సంబంధిత అధికారులు వెంటనే స్పందించి నూతన ట్రంక్ పైప్‌లైన్ నిర్మాణ పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా తిరుమల రెడ్డి మాట్లాడుతూ.. శారదానగర్ నుంచి కుంట్లూరు వరకు ఉన్న ఈ ట్రంక్‌లైన్‌ను 2001లో నిర్మించారని, నాసిరకం పనుల కారణంగా ప్రస్తుతం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుందని ఆరోపించారు. ప్రతి ఏడాది దాదాపు 20 ప్రాంతాల్లో పైప్‌లైన్ క్రుంగిపోతూ వాహనదారులు, స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నప్పటికీ అధికారులు శాశ్వత పరిష్కారంపై దృష్టి సారించడం లేదని విమర్శించారు. రాబోయే 30 సంవత్సరాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని కొత్త ట్రంక్‌లైన్ నిర్మించాలని ప్రభుత్వం, డ్రైనేజీ శాఖ, జాతీయ రహదారి అధికారులను పలు మార్లు కోరినా స్పందన లేకపోవడం బాధాకరమన్నారు.జాతీయ రహదారి సంస్థ అధికారుల నిర్లక్ష్యం వల్లే సమస్య మరింత తీవ్రమవుతోందని ఆరోపించారు.ఇప్పటికైనా ప్రభుత్వం, డ్రైనేజీ శాఖ, జాతీయ రహదారి సంస్థ అధికారులు సమన్వయంతో పనిచేసి హయత్‌నగర్ ప్రజలకు శాశ్వత పరిష్కారం చూపేలా వెంటనే నూతన ట్రంక్ పైప్‌లైన్ నిర్మాణాన్ని ప్రారంభించాలని సామా తిరుమల్ రెడ్డి డిమాండ్ చేశారు.

## విట్టల్ గుప్తాకు దండెం రాంరెడ్డి నివాళి



**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :** తొర్రూరు డివిజన్ పరిధిలోని మునగనూరు గ్రామ మాజీ కౌన్సిలర్ తాళ్ళపల్లి మోహన్ గుప్తా తండ్రి తాళ్ళపల్లి విట్టల్ గుప్తా దశదిన కర్మ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు దండెం రాంరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా విట్టల్ గుప్తా చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మోహన్ గుప్తా కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. విట్టల్ గుప్తా ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షిస్తూ, కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు, డివిజన్ నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు తదితరులు పాల్గొన్నారు.

## నక్కలపల్లిలో ఉచిత వైద్య శిబిరం విజయవంతం

**మొయినాబాద్ జూలై 30 (విశాలభారతి):** రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం నక్కలపల్లి గ్రామంలో కామినేని హాస్పిటల్, కేఎంఆర్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. నగరం నుంచి వచ్చిన నిపుణులైన వైద్యులు గ్రామ ప్రజలకు ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వైద్య సలహాలు అందించడంతో పాటు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మంగళారం యాదయ్య మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో ఇటువంటి వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. నగర స్థాయి వైద్య సేవలను గ్రామాలకు తీసుకురావడం ద్వారా ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన పెరగడంతో పాటు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమాన్ని నిర్వహించిన కామినేని హాస్పిటల్, కేఎంఆర్ ఫౌండేషన్ ప్రతినిధులు, వైద్య బృందానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గౌడ్ల నిరంజన్ గౌడ్, పంచాయతీ కార్యదర్శి యాదగిరి, కేఎంఆర్ ఫౌండేషన్ కోఆర్డినేటర్ ఎన్. సంతోష్ కుమార్, క్యాంపు కోఆర్డినేటర్ ఎం. నందు, వైద్య బృందం, గ్రామ నాయకులు, సిబ్బంది, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ఉప్పరిగూడ గ్రామంలో మద్యపానం నిషేదించాలని తీర్మానం

**గ్రామ సర్పంచ్ బోసుపల్లి శ్రీవేణి నందకుమార్**



**విశాల భారతి ఇబ్రహీంపట్నం** గ్రామంలో మద్యపానం నిషేధించాలని, గ్రామ సర్పంచ్ పాలకవర్గం అన్నారు. ఇబ్రహీంపట్నం మండల పరిదిలోని ఉప్పరిగూడ గ్రామంలో మద్యం అమ్మకాలపై నిషేధం విధించాలని తీర్మాంచిన పాలకవర్గం.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ బోసుపల్లి శ్రీవేణి నంద కుమార్ మాట్లాడుతూ గురువారం గ్రామసభలో గ్రామ ప్రజల వినతుల మేరకు బెల్ట్ షాప్ లలో మద్యం అమ్మకాలు జరుపవద్దని తీర్మాంచడం జరిగిందన్నరు.గ్రామంలోని ప్రజలు మద్య పానానికి బానిసలుగా మారి తమ యొక్క బంగారు భవిష్యత్తులను నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. గ్రామంలో మద్యపానం అమ్మితే కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామసభలో తీర్మానించడం జరిగిందన్నారు. గ్రామంలో మద్యపానం అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని,జరిమానాలు కూడావిధిస్తామన్నారు. అనంతరం బిల్ట్ షాపుల్లో మద్యం అమ్మకాలు జరుపుతున్న వారికి నోటీసులు ఇవ్వడం జరిగిందని అన్నారు.

## నీటి వనరుల పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన

**అశ్వాపురం, విశాల భారతి :** మండలంలోని బిజీకొత్తూరు సమీపంలో గల సీతారామ ప్రాజెక్ట్ పంప్ హౌస్‌తో పాటు మారెళ్లపాడు ఎత్తిపోతల పథకాన్ని గురువారం మండల కేంద్రంలోని రవీంద్రా పబ్లిక్ స్కూల్ విద్యార్థులు సందర్శించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టులో నీటి సరఫరా విధానం, ఎత్తిపోతల పథకం పనితీరు, సాగునీటి నిర్వహణ తదితర అంశాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులు విద్యార్థులకు త్రాగునీరు, వ్యవసాయ రంగంలో నీటి ప్రాధాన్యం, నీటి వనరులను పరిరక్షించాల్సిన అవసరం, ప్రతి నీటి బొట్టును పొదుపుగా వినియోగించడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. భవిష్యత్ తరాలకు నీటి వనరులను సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని సూచించారు. విద్యార్థులు ప్రాజెక్టు విశేషాలను ఆసక్తిగా తెలుసుకుని, పలువురు సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## చందానగర్‌లో ఓటర్ల ప్రత్యేక సవరణ పరిశీలన



**శేరిలింగంపల్లి విశాల భారతి :** చందానగర్ డివిజన్‌లో జరుగుతున్న తెలంగాణ ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని కాంగ్రెస్ నాయకుడు మిరియాల ప్రీతమ్ పరిశీలించారు. బూత్ స్థాయి అధికారులను కలిసి ఓటర్ల నమోదు, వివరాల సవరణ ప్రక్రియను తెలుసుకున్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటరు వివరాలను ధృవీకరించుకుని అవసరమైన మార్పులు చేసుకోవాలని సూచించారు. ఎన్నికల సంఘం చేపట్టిన ఈ కార్యక్రమానికి ప్రజలు సహకరించి, తక్కువ గడువు ఉన్న నేపథ్యంలో సకాలంలో వివరాల సవరణ పూర్తి చేసుకోవాలని ఆయన కోరారు.

## గచ్చిబౌలిలో ప్రమాదం

**మట్టిపెళ్లలు విరిగిపడి ముగ్గురు కార్మికులకు గాయాలు**

**సైబరాబాద్ విశాల భారతి:** నివాస గృహ నిర్మాణంలో కనీస భద్రతా ప్రమాణాలు పాటించకపోవడంతో మట్టిపెళ్లలు విరిగిపడి ముగ్గురు కార్మికులు తీవ్రంగా గాయపడిన ఘటన గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.స్థానిక కంచ గచ్చిబౌలి ప్రాంతంలోని టీఎన్‌జీఓ కాలనీ ఫేజ్ 1, ప్లాట్ సంఖ్య 612లో చుక్కపల్లి కృష్ణ కార్తిక్‌కు చెందిన స్థలంలో భవన నిర్మాణ పనులు జరుగుతున్నాయి. నిబంధనల ప్రకారం పునాది పనుల కోసం దాదాపు తొమ్మిది అడుగుల లోతు వరకు తవ్వకాలు చేపట్టారు. ఉదయం 10 గంటల సమయంలో కార్మికులు ఆ గుంత నుంచి మట్టిని బయటకు తీస్తుండగా, ఒక్కసారిగా పక్కనే ఉన్న మట్టిపెళ్లలు విరిగి వారిపై పడ్డాయి. దీంతో పనుల్లో నిమగ్నమైన రామ్‌కరణ్, అజేష్, సురేష్ అనే ముగ్గురు కార్మికులు మట్టి దిబ్బల కింద చిక్కుకుపోయారు.సమీపంలో ఉన్న తోటి కార్మికులు, స్థానికులు వెంటనే స్పందించి మట్టిని తొలగించి వారిని బయటకు తీశారు. అనంతరం గాయపడిన వారిని అత్యవసర చికిత్స నిమిత్తం దగ్గరలోని హిమగిరి ఆసుపత్రికి తరలించారు.రామ్‌కరణ్, అజేష్‌లకు స్వల్ప గాయాలు కావడంతో ప్రాథమిక చికిత్స అనంతరం వైద్యులు డిశ్చార్జ్ చేయగా, తీవ్రంగా గాయపడిన సురేష్ ప్రస్తుతం చికిత్స పొందుతున్నారని, ఆయన ఆరోగ్యం నిలకడగానే ఉందని వైద్య వర్గాలు తెలిపాయి.సమాచారం అందుకున్న గచ్చిబౌలి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. పునాది తవ్వకాల సమయంలో కాంట్రాక్టర్, యాజమాన్యం కనీస భద్రతా చర్యలు తీసుకోకపోవడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని ప్రాథమిక విచారణలో తేలింది. బాధ్యతారాహిత్యంగా వ్యవహరించినందుకు గానూ సైట్ మేస్త్రీ, సూపర్‌వైజర్, ప్లాట్ యజమానిపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు వేగవంతం చేశారు.

## నానక్రామ్‌గూడలో నిర్మాణ కార్మికులకు అవగాహన.. లేబర్ కార్డుల పంపిణీ

**సైబరాబాద్ పోలీసులు, కార్మిక శాఖ ఆధ్వర్యంలో కార్యక్రమం**



**సైబరాబాద్ విశాల భారతి:** నిర్మాణ కార్మికుల సంక్షేమం, భద్రతే ధ్యేయంగా సైబరాబాద్ రాయదుర్గం పోలీసులు, తెలంగాణ రాష్ట్ర కార్మిక శాఖ సంయుక్తంగా ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించాయి. గురువారం సాయంత్రం నానక్రామ్‌గూడలోని ఎస్ ఎస్ ఐ టవర్‌లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో అర్హులైన కార్మికులకు 'భవన మరియు ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు' లేబర్ కార్డులను అధికారులు అందజేశారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో అధికారులు మాట్లాడుతూ.. ప్రభుత్వం కల్పిస్తున్న అనేక సంక్షేమ ఫలాల గురించి కార్మికులకు కూలంకషంగా వివరించారు. కార్మిక బోర్డు ద్వారా లభించే ఉద్యోగుల రాష్ట్ర బీమా (ఈఎస్ఐ), భవిష్య నిధి (పీఎఫ్), ఉచిత వైద్య సహాయం, ప్రసూతి లబ్ధి, వివాహ సాయం, ప్రమాద భీమాతో పాటు నైపుణ్య శిక్షణ పథకాలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని సూచించారు. బిల్డర్లు, కాంట్రాక్టర్లు తమ వద్ద పనిచేస్తున్న ప్రతి కార్మికుడికి సంక్షేమ బోర్డులో నమోదు తప్పనిసరిగా చేయించాలని, అప్పుడే వారికి ప్రభుత్వ సహాయం అందుతుందని స్పష్టం చేశారు. నిర్మాణ సంస్థల ప్రతినిధులు సైతం ఈ ప్రక్రియకు పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.ఇదే వేదికపై సైబర్ నేరాలు, మహిళల రక్షణ, రోడ్డు భద్రతపై పోలీసు అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి అవగాహన కల్పించారు. మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్పరిణామాలను వివరిస్తూ, వాటికి దూరంగా ఉండాలని కార్మికులను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ ఉన్నతాధికారులు, కూకట్‌పల్లి జోన్, మాదాపూర్ డివిజన్ అధికారులు, శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్, కార్మిక శాఖ అధికారులు,ర్మాణ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ముస్కాన్ చొరవతో తప్పిపోయిన బాలుడు తల్లిదండ్రుల చెంతకు

**మియాపూర్‌లో గుర్తించి కౌన్సెలింగ్ అనంతరం అప్పగించిన పోలీసులు**

**సైబరాబాద్ విశాల భారతి:** ఆపరేషన్ ముస్కాన్ 12 కార్యక్రమంలో భాగంగా మియాపూర్ పోలీసుల చొరవతో తప్పిపోయిన బాలుడు తిరిగి తల్లిదండ్రుల చెంతకు చేరాడు. మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో బిక్షాటన చేస్తూ కనిపించిన బాలుడిని పోలీసులు రక్షించి, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులతో కలిసి విచారించారు. బాలుడు తన వివరాలు చెప్పలేకపోవడంతో తాత్కాలికంగా ప్రభుత్వ బాలుర వసతి గృహంలో ఉంచి, వివిధ పోలీస్ స్టేషన్లలో ఆరా తీశారు.దర్యాప్తులో అల్లాపూర్ పోలీస్ స్టేషన్‌లో బాలుడు కనిపించకుండా పోయినట్లు నమోదైన ఫిర్యాదుతో సరిపోల్చగా, అతడే తప్పిపోయిన బాలుడిగా నిర్ధారణ అయింది. అనంతరం చట్టపరమైన ప్రక్రియలు పూర్తి చేసి, బాలుడికి, తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించిన తర్వాత సురక్షితంగా కుటుంబ సభ్యులకు అప్పగించారు. బాలుడు క్షేమంగా తిరిగి దొరకడంతో తల్లిదండ్రులు ఆపరేషన్ ముస్కాన్ 12 బృందం, పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.





## నవ్వుతో కట్టిపడేస్తున్న ప్రగ్యా జైశ్వాల్

కంచె, అఖండ, అఖండ 2, డాకు మహారాజ్ సినిమాలతో తెలుగులోమంచి ఫ్యాన్ ఫాలోయింగ్ సంపాదించుకుంది ప్రగ్యా జైశ్వాల్. ఈ జబల్ పూర్ బ్యూటీ నెట్టింట యాక్టివ్‌గా ఉంటూ ఫాలోవర్లలో జోష్ నింపుతుంటుంది. సోషల్ మీడియాలో తనకు సంబంధించిన అప్‌డేట్‌సను షేర్ చేసుకునే ప్రగ్యాజైశ్వాల్ తాజాగా పోస్ట్ చేసిన ఫొటోలు కుర్రకారుకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి.ప్రగ్యాజైశ్వాల్ సెలబ్రిటీ, ఫ్యాషన్ స్టైలిష్ట్ నటాషా బోత్రా అండ్ టీం డిజైన్ చేసిన ట్రెండీ కాస్ట్యూమ్‌స్‌లో హొయలు పోయింది. బ్లూ అండ్ వైట్ చారలతో డిజైన్ చేసిన డ్రెస్‌లో చిరునవ్వులు చిందిస్తూ కెమెరాకు ఫోజులిచ్చింది. ఈ ఫొటోలను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసింది. 'చారలు తిరిగి వచ్చాయని విన్నా..' అంటూ ఈ స్టిల్‌స్‌కు క్యాప్షన్ ఇచ్చింది. చూసేందుకు రెండు కళ్లు చాలవన్నట్టుగా ఉన్న ప్రగ్యాజైశ్వాల్ స్టిల్స్ ఇప్పుడు నెట్టింట ట్రెండింగ్ అవుతున్నాయి. ప్రస్తుతం బెల్లంకొండ సాయి శ్రీనివాస్ హీరోగా నటిస్తున్న టైసన్ నాయుడులో ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది ప్రగ్యాజైశ్వాల్.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gangarapu Vijay. RNI No APTEL/2010/32877.